Follow: @ANNTELUGU
19-08-2026
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 225 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## 2029లో మళ్ళీ మనమే 117 సీట్లతో అధికారంలోకి వస్తాం

### సర్వాయిపాపన్న విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటి పైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని

మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్



### స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ

- ఏపీ అసెంబ్లీలో చంద్రబాబు ప్రకటన

03



### హైద్రాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సామ రామ్మోహన్ రెడ్డి?

- ప్రచార విభాగంలో కీలకంగా సామ
- సామ వైపే సీఎం మొగ్గు చూపినట్లు సమాచారం

02



### అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

- నితిన్ నబీన్ నియామకాలు

02

### 22ఏ భూములు విషయంలో

# కట్టు కథలు నమ్మొద్దు

## దళారులను ఆశ్రయించొద్దు



- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై సీఎం సమీక్ష
- ప్రజల ఆస్తి పరిరక్షణకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వెల్లడి

**హైదరాబాద్, మహా :** ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు సమీక్ష నిర్వహించారు.

కట్టుకథలు నమ్మొద్దు

రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకొన్న వారి ఆస్తులు 22ఏ జాబితాలో ఉంటే, రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలించి, అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు 22ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారని తెలిపారు. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని, ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు భూములకు సంబంధించి ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది రానివ్వమని స్పష్టం చేశారు. 22ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. ఎలాంటి పుకార్లు, కట్టు కథలను విశ్వసించవద్దని కోరారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు సమీక్ష నిర్వహించారు.

### కట్టుకథలు నమ్మొద్దు

రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకొన్న వారి ఆస్తులు 22ఏ జాబితాలో ఉంటే, రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలించి, అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు 22ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారని తెలిపారు. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని, ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు భూములకు సంబంధించి ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది రానివ్వమని స్పష్టం చేశారు. 22ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. ఎలాంటి పుకార్లు, కట్టు కథలను విశ్వసించవద్దని కోరారు.




# ఇరిగేషన్ అధికారులా మజాకా..!

## జోడిమెట్లలో కనుమరుగైన నాడెం చెరువు నాలా...!

- యదేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు...!
- సూత్రపాత్రధారులు ఇరిగేషన్ అధికారులే..!
- నెలకో అధికారి బదిలీ.. దండిగా వసూళ్లు..!
- డమ్మీగా మారిన డీఈఈ అంజనేయులు, ఏఈఈ మౌనిక...!
- హెచ్‌ఎండీఏ జారీ చేసిన అనుమతులు రద్దు చేయాలి: వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు...!
- నిర్మాణాలు ఆపకుంటే ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతాం.. పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి...!
- చస్తేగాని స్పందించరా.. వరద బాధితుల ఆక్రందన ...!

02

ప్రభుత్వ భూములను, సహజ వనరులను సంరక్షించాల్సిన రక్షకులే భక్షకులుగా మారితే ఇక సామాన్యుడికి దిక్కెవరు? చట్టాన్ని గౌరవించాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలిస్తే వ్యవస్థ ఎటు పోతుంది? ప్రజాధనం కొల్లగొట్టుకుపోతున్నా, ప్రకృతి వనరులు ధ్వంసమవుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఘట్కేసర్ సర్కిల్ జోడిమెట్ల చౌరస్తా నాడెం చెరువు నాలాపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలు అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యానికి, లాలూచీకి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇరిగేషన్ చట్టంలోని నిబంధనలను తుంగలో తొక్కి, నాలాను నిలువునా మింగేస్తూ, సహజ ప్రవాహాన్ని అడ్డుకుంటూ అక్రమార్కులు యథేచ్ఛగా నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే, అక్రమంగా వెలుస్తున్న బహుళ అంతస్థుల కమర్షియల్ నిర్మాణాలపై స్థానికులు గగ్గోలు పెడుతున్నా, లిఖితపూర్వకంగా ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.క్షేత్రస్థాయిలో అక్రమాలను అడ్డుకోవాల్సిన డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) అంజనేయులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) మౌనిక పూర్తిగా డమ్మీలుగా మారిపోయారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కళ్లముందే నాడెం నాలా కనుమరుగవుతున్నా, అక్రమ కట్టడాలు శరవేగంగా కొనసాగుతున్నా ఈ ఇద్దరు అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద కథే నడుస్తోందని వరద బాధితులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా లేక ముడుపుల మత్తులో జోగుతున్నారా అని వివిధ కాలనీ సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.



## అర్జున అవార్డులను ప్రకటించిన కేంద్రం

- అరుమాయినాయగానికి 'జీవిత సాఫల్య' పురస్కారం
- చెస్ క్రీడాకారులు విధిత్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్‌లకు అర్జున అవార్డు
- తెలుగు తేజాలకు దక్కిన చోటు
- గాయత్రీ , శ్రీకాంత్ లకు అర్జున అవార్డు

04

## పసిడి పట్టులో ఐరోపా దేశాలు

04






# 22ఏ రచ్చ

### హైదరాబాద్.,. రంగారెడ్డి జిల్లాల్లో గందరగోళం

- చక్కదిద్దేపనిలో పొంగులేటి
- తప్పును ఒప్పుకొని సరిదిద్దుతున్నాం
- ధరణి తో చేసిన తప్పులకు సమాధానం చెప్పే ధైర్యం హరీష్‌రావుకు ఉందా?
- ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారు
- 15 రోజుల పాటు రోజువారీగా దరఖాస్తుల పరిశీలన
- మీడియాతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- సామాన్య ప్రజల హక్కులు, ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించే బాధ్యత మాది

02

### 22ఏ నిషేదిత జాబితా వెనుక పెద్ద కుట్ర

**నేను గతంలోనే సీఎంకు చెప్పా**
**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**హైదరాబాద్, మహా :** యాదగిరిగుట్టలో కూడా 42 వేల ఎకరాల భూమి 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారని, ప్రతిపక్షాలు ఇవాళ బయట పెట్టారు, కానీ ఈ విషయం 3 నెలల కిందటే అక్కడి స్థానిక ఎమ్మెల్యే నాతో చెప్పుకుని బాధపడ్డాడని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఇది ఎవరో ఉద్దేశపూర్వకంగా చేసినట్లు అనిపిస్తోందని, తాను అప్పుడే ముఖ్యమంత్రికి ఈ విషయం గురించి చెప్పానన్నారు. 22ఏ నిషేధిత జాబితా రావడం వెనుక కుట్ర ఉండొచ్చునని, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర ఉందని భావిస్తున్నానన్నారు.

### పొంగులేటి మంత్రిపదవికి రాజీనామా చేయాలి

**రాత్రికి రాత్రే ఇళ్ళు నిషేదితజాబితాలోకి ఎలా వెళ్తాయి?**
**బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీష్ ఫైర్**



**హైదరాబాద్, మహా :** సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను

మిగతా 2వ పేజీలో

### ఫీనిక్స్ నుండి 15వేల కోట్లు ఎలా వచ్చాయి?

**మంత్రి పొంగులేటిపై ఏలేటి ఆరోపణలు**

**హైదరాబాద్, మహా :** 22ఏ పై సారీ చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా అందులో ఉందని చెప్పడానికి సిగ్గుండాలి. మీరు అకౌంటబులిటీ తీసుకొని ఎందుకు మంత్రి పదవికి రాజీనామా చేయడం లేదు పొంగులేటి? ఏ రకంగా ఫీనిక్స్ కంపెనీ నుంచి రూ. 15,000 కోట్లు మీ కంపెనీ ఖాతాలోకి వచ్చాయి?" అంటూ బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వరరెడ్డి మంత్రి పొంగులేటి పై తీవ్ర ఆరోపణలు చేశారు.



# ఇరిగేషన్ అధికారులా మజాకా..!

**మహా, సిటీ బ్యూరో:**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ సర్కిల్, పోచారం డివిజన్, జోడిమెట్ల చౌరస్తా వద్ద నాడెం చెరువు నాలాపై కొనసాగుతున్న నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో చెరువులు, నాలాలు, కుంటలు, సహజ నీటి ప్రవాహ మార్గాల పరిరక్షణ కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. ఒకవైపు అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు ప్రకటిస్తుండగా, మరోవైపు ప్రజలకు ప్రాణాధారమైన జలమార్గాలే క్రమంగా ఆక్రమణలకు గురవుతూ కనుమరుగవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒకప్పుడు వర్షపు నీటిని సాఫీగా తరలిస్తూ పరిసర కాలనీలను ముంపు ముప్పు నుంచి కాపాడిన నాడెం చెరువు నాలా నేడు భారీ కాంక్రీట్ నిర్మాణాల మధ్య తన ఉనికిని కోల్పోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలా హద్దులు క్రమంగా కుంచించుకుపోతుండగా, దాని సహజ ప్రవాహ మార్గాన్ని మార్చేస్తూ బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు నిర్మితమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై పలు మార్లు ఫిర్యాదులు చేసినా, వార్తలు ప్రచురితమైనా, బాధితులు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగినా ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత వర్షాకాలంలో హిమగిరి కాలనీ, డాక్టర్స్ కాలనీ, కాకతీయ కాలనీ, విజయసాయి కాలనీ, పోచారం కాలనీ, ఎంఎల్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ముంపు సమస్యలను ఎదుర్కొన్నారు. ఇళ్లలోకి నీరు చేరడం, వాహనాలు మునిగిపోవడం, కుటుంబాలు రాత్రిళ్లు నిద్ర లేకుండా గడపడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, ఆ పరిస్థితులకు ప్రధాన కారణంగా చెబుతున్న నాలా ఆక్రమణలపై మాత్రం ఇప్పటికీ నిర్ణయాత్మక చర్యలు కనిపించడం లేదని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




ఇంత నిర్లక్ష్యమా..?
ఇరిగేషన్ అధికారుల కనుసన్నల్లోనే నాలా ఆక్రమణలు!


ఇంత నిర్లక్ష్యమా..?
బరితెగించిన అక్రమం..!
జోడిమెట్లలో నాలాను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు...!
నాడెం నాలాపై యథేచ్ఛగా కొనసాగుతున్న కమర్షియల్
- నాలా ఆక్రమణలతో నీట మునుగుతున్న కాలనీలు...!
- చిరు జల్లులకే చెరువులుగా మారుతున్న రోడ్లు...!
- అటువైపు కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు...!
- పత్తా లేని ఇరిగేషన్ అధికారులు...!
- ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం...!
- మళ్లీ మొదలైన నిర్మాణ పనులు...!


మహా
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS
బరితెగించిన బిల్డర్లు...!
జోడిమెట్లలో నాలాల దురాక్రమణ..!

మరోవైపు, గతంలో ఇదే నిర్మాణాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన అధికారులు మారిన తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగడం, సంబంధిత శాఖల మధ్య పరస్పర బాధ్యతారాహిత్యం కనిపించడం వంటి పరిణామాలు ఈ వ్యవహారంపై మరిన్ని సందేహాలను రేకెత్తిస్తున్నాయి. నాలాలను రక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ, నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం, అనుమతులను పరిశీలించాల్సిన ఇతర శాఖలు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాయా లేదా అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికుల నుంచే కాకుండా ప్రజాప్రతినిధులు, వరద బాధితుల నుంచీ వినిపిస్తున్నాయి.నాలా గర్భంలోనే నిర్మాణాలు కొనసాగుతున్నాయంటూ ఆరోపణలు వస్తున్నా, రాత్రింబవళ్లు పనులు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నా, సంబంధిత అధికారులు మాత్రం మౌనం వీడకపోవడం పరిస్థితి తీవ్రతను మరింత పెంచుతోంది. దీంతో "ప్రజల ప్రాణాలా ముఖ్యమా..? లేక అక్రమ నిర్మాణాలా ముఖ్యమా..?" అనే ప్రశ్న ఇప్పుడు జోడిమెట్ల ప్రాంత ప్రజల నోట మారుమోగుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి నాడెం చెరువు నాలా అసలు హద్దులను గుర్తించి, ఆక్రమణలపై చర్యలు తీసుకుంటారా..? లేక మరో వరద విపత్తు సంభవించిన తర్వాత మేల్కొంటారా..? అనే ప్రశ్నకు సమాధానం కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు.నాడెం నాలా ఉనికిని ప్రమాదంలో పడేశారని కమిషనర్‌కు సమగ్ర నివేదిక ఇవ్వనున్నారు. బాధ్యత గల స్థానాల్లో ఉండి అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు, వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయనున్నారు. ఈ నివేదికలో గతంలో జరిగిన బదిలీల వివరాలను, బిల్డర్ల నుంచి అధికారులు దండిగా వసూలు చేసిన లీలలను కూడా పొందుపరిచినట్లు సమాచారం.

**హెచ్ఎండీఏ అనుమతులు రద్దు చేయాలి:**

నాలాను కబ్జా చేసి నిర్మిస్తున్న ఈ అక్రమ కట్టడాలకు హెచ్ఎండీఏ ఏ ప్రాతిపదికన అనుమతులు జారీ చేసిందో స్పష్టత ఇవ్వాలని నాడెం నాలా పరివాహక ప్రాంత కాలనీల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు పత్రాలతో, ఇరిగేషన్ అధికారుల లాలూచీతో సాధించిన ఎన్ఓసీల ఆధారంగానే ఈ అనుమతులు లభించాయని స్థానిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. నాలా ప్రవాహాన్ని పూర్తిగా మార్చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా ఇరుకైన స్థలంలో భారీ పిల్లర్లు లేపుతున్నా హెచ్ఎండీఏ నిఘా విభాగానికి కనబడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ నకిలీ, లాలూచీ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో వర్షాకాలంలో వరద నీరు సాఫీగా సాగిపోవడానికి దారి లేక, చుట్టుపక్కల కాలనీలన్నీ ముంపునకు గురై వేలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోడిమెట్ల నాలా కబ్జా వల్ల ప్రధానంగా హిమగిరి కాలనీ, డాక్టర్స్ కాలనీ, కాకతీయ కాలనీ, అన్నానగర్ కాలనీ, విజయసాయి కాలనీ, పోచారం కాలనీ, ఎమ్ఎల్ఆర్ కాలనీ, అరుంధతి కాలనీ, వెంకటేశ్వర కాలనీల ఉనికి తీవ్ర ప్రమాదంలో పడిందని, చిన్న వర్షానికే ఇవన్నీ జలమయం అవుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులపై బాధితులు,**


బరితెగించిన బిల్డర్లు...!
నాలాలపై వ్యాపార సముదాయాలు...!
నాడెం నాలాను మింగి కమర్షియల్ నిర్మాణాలు!
నోట్ల కట్టలతో నోళ్లు మూయించిన అక్రమార్కులు...!
- బిల్డర్లతో కుమ్మక్కైన అధికార యంత్రాంగం...!
- వర్షపు నీరు వెళ్లే దారి లేక కాలనీలు జలమయం!
- హైడ్రాకి ఫిర్యాదు చేసిన స్థానికులు...!
- క్షేత్ర స్థాయి పరిశీలన ..చర్యలు శూన్యం!
- పత్తా లేని ఇరిగేషన్ అధికారులు!
- స్పెషల్ టాస్క్ ఫోర్స్ రంగంలోకి దిగితే వార్ వన్ సైడే...!

**కాలనీ అధ్యక్షుల ఆగ్రహం:**

నాడెం నాలా కబ్జా వ్యవహారంలో ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారుల తీరుపై స్థానిక కాలనీల అధ్యక్షులు, బాధితులు నిప్పులు చెరుగుతున్నారు. తాము సర్వస్వం కోల్పోయే ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు ముడుపుల మత్తులో జోగడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నేరుగా అధికారులనే టార్గెట్ చేస్తూ విడివిడిగా తమ నిరసన గళాన్ని విప్పారు.

**ఫిర్యాదు చేసినా కదలని 'హైడ్రా'.. 'పరిశీలిస్తాం' మాటలకే పరిమితం!**

స్థానిక ఇరిగేషన్ అధికారులు పూర్తిగా కబ్జాదారులతో కుమ్మక్కవడంతో, విసిగిపోయిన వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బాధితులు 'హైడ్రా'ను ఆశ్రయించారు. నాడెం నాలా కబ్జా, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన పూర్తి ఆధారాలు,ఫోటోలు, వీడియోలతో కూడిన రాతపూర్వక ఫిర్యాదును ఇప్పటికే 'హైడ్రా' ఉన్నతాధికారులకు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, నాలాల కబ్జాలపై బుల్డోజర్లతో విరుచుకుపడే హైడ్రా.. జోడిమెట్ల విషయానికి వచ్చేసరికి మాత్రం తాత్సారం చేస్తోందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు ఇచ్చి ఇన్ని రోజులవుతున్నా "పరిశీలిస్తాం.. పరిశీలిస్తాం" అనే సాకులు వెతుకుతూ కాలయాపన చేస్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. హైడ్రా అధికారుల ఈ తాత్సారం అక్రమార్కులకు మరింత బలాన్ని ఇస్తోందని, వారి అండ చూసుకునే నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేస్తున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కు సమగ్ర నివేదిక!**

క్షేత్రస్థాయి అధికారులు అంజనేయులు, మౌనికల అవినీతి లీలలపై కాలనీ ప్రతినిధులు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కు కూడా ఫిర్యాదు చేయడానికి సర్వం సిద్ధం చేశారు. కింది స్థాయి అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, నాడెం నాలా ఉనికిని ప్రమాదంలో పడేశారని కమిషనర్‌కు సమగ్ర నివేదిక ఇవ్వనున్నారు. బాధ్యత గల స్థానాల్లో ఉండి అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు, వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయనున్నారు. ఈ నివేదికలో గతంలో జరిగిన బదిలీల వివరాలను, బిల్డర్ల నుంచి అధికారులు దండిగా వసూలు చేసిన లీలలను కూడా పొందుపరిచినట్లు సమాచారం.

**చస్తే గాని స్పందించరా.. వరద బాధితుల ఆక్రందన**

నాడెం నాలా దురాక్రమణ, నాలా మధ్యలో అక్రమ నిర్మాణాలు, అధికారులు అవలంబిస్తున్న తీరు స్థానికుల్లో తీవ్ర ఆగ్రహాన్ని, ఆందోళనను కలిగిస్తోంది. నాడెం నాలాను నిలువునా మింగేస్తూ, వరద ప్రవాహాన్ని అడ్డుకుంటూ వెలుస్తున్న అక్రమ కట్టడాల వల్ల రాబోయే రోజుల్లో ఏ క్షణమైనా ముంపు ముప్పు పొంచి ఉంది. "ప్రజల ప్రాణాలు పోతేగానీ అధికారులు స్పందించరా?" అని బాధితులు తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఘోరం జరిగి, కాలనీలు మునిగిపోయి, ప్రాణ నష్టం సంభవించిన తర్వాత వచ్చి మొసలి కన్నీరు కార్చడం కంటే.. ఇప్పుడే మేల్కొనాలని స్థానిక కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు.

**విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరపాలి!**

నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలకు బాటలు వేసిన హెచ్ఎండీఏ అధికారుల పాత్రపై తక్షణమే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేత ఉన్నత స్థాయి విచారణ జరిపించాలి. ఇరిగేషన్ అధికారులతో కలిసి తప్పుడు నివేదికలు సృష్టించి, నాడెం చెరువు నాలాపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు జారీ చేసిన హెచ్ఎండీఏ అనుమతులను తక్షణమే రద్దు చేయాలి. అవినీతికి పాల్పడి, ప్రజా రక్షణను పణంగా పెట్టి కబ్జాదారులతో చేతులు కలిపిన ప్రతీ అధికారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారిని కఠినంగా శిక్షించినప్పుడే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని, ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి నాడెం చెరువు నాలాను కాపాడాలని వరద బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

**"అధికారులు కబ్జాదారులకు ఏజెంట్లుగా మారారు: జి. నాగరాజు (డాక్టర్స్ కాలనీ ప్రతినిధి)**



ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిన ఇరిగేషన్ అధికారులు పూర్తిగా కబ్జాదారులకు ఏజెంట్లుగా మారిపోయారు. కాలనీ వాసుల రక్షణ కంటే వారికి అందుతున్న ముడుపులే ఎక్కువయ్యాయి. విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను కూల్చేవరకు మేము వెనకడుగు వేసేది లేదు.

**"బాధ్యులైన అధికారులను జైలుకు పంపాలి: కె. దయాకర్ (హిమగిరి కాలనీ ప్రతినిధి)**



అక్రమ కట్టడాల యజమానుల నుంచి నెలవారీగా భారీ ఎత్తున ముడుపులు అందుతుండడం వల్లే ఇక్కడి అధికారులు డమ్మీలుగా మారిపోయారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రజా హక్కులను కాపాడాల్సిన వారే ఇలా కబ్జాదారులతో చేతులు కలిపి లాలూచీ పడడం సిగ్గుచేటు. ఈ అక్రమ వసూళ్ల పర్వంపై ఏసీబీతో పాటు ఉన్నత స్థాయి విచారణ జరిపించి దోషులను జైలుకు పంపాల్సిందే.

**"అక్రమ నిర్మాణాల వెనుక కోట్ల రూపాయల అవినీతి: రమేష్ (ఎమ్ఎల్ఆర్ కాలనీ ప్రతినిధి)**

నిబంధనల ప్రకారం నాలాల పక్కన ఎలాంటి కాంక్రీట్ కట్టడాలు చేపట్టకూడదు. కానీ ఇక్కడ రూల్స్ అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. బిల్డర్లు ఇష్టారాజ్యంగా పిల్లర్లు లేపుతున్నా స్థానిక ఏఈఈ, డీఈఈలు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక కోట్ల రూపాయల లాలూచీ దాగి ఉంది. ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరపాలి

**"నిర్మాణాలు ఆపకుంటే ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నా: పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి..!**



నాడెం నాలా పరిరక్షణకై స్థానిక ప్రజల పక్షాన పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి రంగంలోకి దిగారు. నాలాపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయకపోతే ఊరుకునేది లేదని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుల వెనుక ఎంతటి రాజకీయ హస్తం ఉన్నా సరే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. లేనిపక్షంలో బాధ్యులైన ఇరిగేషన్ అధికారుల కార్యాలయం ముందు కాలనీ వాసులందరితో కలిసి భారీ ఎత్తున ధర్నాకు దిగుతామని, అక్రమాలను అడ్డుకునే వరకు పోరాటం ఆపేది లేదని ఆయన అల్టిమేటం జారీ చేశారు.

**"అధికారుల అవినీతి బండారాన్ని బట్టబయలు చేస్తాం: ఆకిటి కృష్ణారెడ్డి (హిమగిరి కాలనీ ప్రెసిడెంట్)"**



మా కళ్లముందే నాలాను మింగేస్తుంటే డీఈఈ అంజనేయులు, ఏఈఈ మౌనిక నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడం వెనుక ఉన్న అంతర్యమేంటి? ఇరిగేషన్ అధికారుల పరోక్ష అండ చూసుకునే బిల్డర్లు యథేచ్ఛగా రెచ్చిపోతున్నారు. నాలా వెడల్పును సగానికి పైగా తగ్గించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి చేతులు మారింది. తక్షణమే ఉన్నతాధికారులు దీనిపై స్పందించి చర్యలు తీసుకోకపోతే ఇరిగేషన్ అధికారుల అవినీతి బండారాన్ని ఆధారాలతో సహా బట్టబయలు చేస్తాం.

**"ఏ ముంపు వచ్చినా డీఈఈ, ఏఈఈలదే పూర్తి బాధ్యత: ఇ. రవికుమార్ (డాక్టర్స్ కాలనీ ప్రెసిడెంట్)"**



ఇరిగేషన్ శాఖకు చెందిన కింది స్థాయి అధికారులు నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతూ బిల్డర్లకు పనులు పూర్తి చేసుకోవడానికి లోపాయికారీగా సమయం ఇస్తున్నారు. హెచ్ఎండీఏ జారీ చేసిన తప్పుడు అనుమతులను తక్షణమే రద్దు చేసి, నాలాను పూర్వ రూపానికి తీసుకురావాలి. అధికారుల అలసత్వం వల్ల స్థానికులు తీవ్ర అభద్రతాభావానికి గురవుతున్నారు, రేపు ఏ ముంపు ముంచుకొచ్చినా దానికి డీఈఈ, ఏఈఈలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**"అమాయక ప్రజలను బలిపెడతారా?: ఎస్ శ్రీనివాస్( డాక్టర్స్ కాలనీ)**



చిన్న వర్షానికే ఇక్కడ కాలనీలన్నీ జలమయం అవుతున్నాయి. రేపు భారీ వర్షాలు వస్తే మా ఇళ్ల పరిస్థితి ఏంటి? అధికారుల నిర్లక్ష్యానికి, స్వార్థానికి అమాయక ప్రజలు బలికావాలా? నిబంధనల ప్రకారం బఫర్ జోన్ వదిలిపెట్టకుండా అక్రమ కట్టడాలు కడుతుంటే కళ్లు మూసుకున్న ఇరిగేషన్ అధికారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**"అధికారులను సస్పెండ్ చేసే వరకు పోరాటం ఆపం: ఎమ్. వెంకటేష్ (విజయసాయి కాలనీ ప్రతినిధి)**

నాడెం నాలా బఫర్ జోన్ నిబంధనలను ఇక్కడ ఇరిగేషన్ అధికారులే స్వయంగా తుంగలో తొక్కారు. నాలా ప్రవాహాన్ని ప్రకృతి విరుద్ధంగా మార్చడం వల్ల చుట్టుపక్కల కాలనీలు మునగడమే కాకుండా భూగర్భ జలాలు కూడా కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. అక్రమాలకు పాల్పడిన బిల్డర్లతో పాటు వారికి సహకరించిన ప్రతి అధికారిని సర్వీస్ నుంచి సస్పెండ్ చేసే వరకు మా పోరాటం ఆపే ప్రసక్తే లేదు.

## హైద్రాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగాసామ రామ్మోహన్ రెడ్డి?

**సీఎం గ్రీన్ సిగ్నల్**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి దాదాపు ఖరారయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగంలో కీలకంగా పనిచేసిన సామ రామ్మోహన్ రెడ్డి అభ్యర్థిత్వానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. గత రెండేళ్ళుగా పార్టీ తరుపున, ప్రతిపక్షాలను కౌంటర్ చేస్తూ బలమైన వాదనలు వినిపించిన సామా అభ్యర్థిత్వంపై సీఎం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. గ్రాడ్యుయేట్ ఎన్ రోల్ మెంట్ ప్రక్రియ కూడా సామా టీమ్ ప్రారంభించింది. ఈ పదవిపై అనేకమంది కన్నేసినా.. ఫైనల్ గా సామా వైపు సీఎం సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. నల్లగొండఖమ్మం వరంగల్ పై త్వరలో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

## అసెంబ్లీ ఎన్నికల వేళ..

**యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు**

**ఢిల్లీ, మహా :** వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచి వ్యూహాలకు పదును పెడుతోంది. ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మంగళవారం ఆయా రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌లు, కోఇన్‌ఛార్జ్‌లను నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేను నియమించారు. కోఇన్‌ఛార్జ్‌గా జాతీయ కార్యదర్శి జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్‌కు బాధ్యతలు అప్పగించారు. దేశ రాజకీయాల్లో కీలక రాష్ట్రంగా ఉన్న యూపీలో 2027 అసెంబ్లీ ఎన్నికల నేథ్యంలో సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల వ్యూహంపై తావ్డే బృందం దృష్టి పెట్టనుంది. ఇక పంజాబ్ రాష్ట్ర భాజపా ఇన్‌చార్జ్‌గా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సతీశ్ పూనియాను నియమించారు. అలాగే గుజరాత్ బాధ్యతలను రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌కు అప్పగించారు. ఇతర రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌ల నియామకాలను త్వరలో చేపడతామని బీజేపీ తెలిపింది.



## 22ఎ రచ్చ

**హైదరాబాద్, మహా :** ఇది పేదల ప్రభుత్వం. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవాడికి అన్యాయం చేయదని, పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదని, వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ, 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోమారు స్పష్టం చేస్తూ సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 మొత్తం 34 రిజిస్ట్రేషన్లు జరిగాయని మంత్రి వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతోందని తెలిపారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా పొరపాటును పారదర్శకంగా అంగీకరించి . అదే సమయంలో జరిగిన తప్పును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నామని ప్రజలను ఇబ్బందుల్లో వదిలేసే ప్రభుత్వం తమది కాదని స్పష్టం చేశారు.

వివిధ జీవోలు, మెమోల ద్వారా గత ప్రభుత్వాల కాలంలో క్రమబద్ధీకరించబడిన ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు ఆన్‌లైన్ అప్‌లోడింగ్‌లో సాంకేతిక లోపం కారణంగా 22ఏ జాబితాలోకి వచ్చాయని మంత్రి వివరించారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే గుర్తించిందని, బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని తెలిపారు. 22ఏ సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి జెన్యూన్ ప్రైవేట్ ఆస్తులన్నింటినీ తక్షణమే క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కావాలనే 22ఏలో భూములు పెట్టి, వాటిని తొలగించడానికి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేత హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలపై మంత్రి పొంగులేటి ఘాటుగా స్పందించారు. "విమర్శలు చేయడం చాలా సులువు.. కానీ బాధ్యత తీసుకోవడం అంత సులువు కాదు. 22ఏ విషయంలో పొరపాటు జరిగిందని మేము బహిరంగంగా అంగీకరించాం.. ఆ పొరపాటును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నాం. వారు పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ధరణి పేరుతో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులకు, జరిగిన తప్పులకు ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా? కనీసం క్షమాపణ చెప్పారా?" అని ప్రశ్నించారు.



తప్పు జరిగితే దాన్ని అధికారుల మీదకు నెట్టేసి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పొరపాటును అంగీకరించామన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్ రావుకు ఇప్పటికీ 30 శాతం కమిషన్లు ఎందుకు గుర్తుకొస్తున్నాయో ప్రజలకు తెలుసు. వాళ్లు ఏ పద్ధతిలో పాలన సాగించారో ప్రజలు మరిచిపోలేదు. ఇప్పుడు పేదల సమస్యను పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం చాలా సులభం. కానీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో కూడా సమాధానం చెప్పాలన్నారు. కాళేశ్వరం విషయంలో జరిగిన పరిణామాలకు హరీశ్ రావు ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా? ఇప్పుడు నేను మాత్రం నా శాఖలో పొరపాటు జరిగిందని చెప్పి, దానికి పరిష్కారం చూపేందుకు బాధ్యత తీసుకుంటున్నాను. ఇదే తేడా అని మంత్రి స్పష్టం చేశారు.

ఆరోపణలకు ఆధారాలు చూపాలి

బిజెఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై మంత్రి స్పందిస్తూ తాటాకు చప్పుళ్లకు నేను భయపడను. నాపై ఏదైనా ఆరోపణ చేస్తే ఆధారాలతో మాట్లాడాలి. ఆధారం ఉంటే ప్రజల ముందు పెట్టాలి. ఫీనిక్స్, రాఘవ తదితర సంస్థలతో వ్యాపార రంగంలో లావాదేవీలు జరగడం సహజం. వాటిని పట్టుకుని రాజకీయ ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. నేను రెండు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్నాను. అంచెలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. ఒక్కరోజులో వేల కోట్లకు ఎదిగిన వ్యక్తిని కాదు. నా వ్యాపార ప్రస్థానం, నా నేపథ్యం గురించి ఈ రాష్ట్ర ప్రజలకు తెలుసు. ఆరోపణలు చేసేవారు ముందుగా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని మంత్రి హితవు పలికారు

## పొంగులేటి మంత్రి పదవికి రాజీనామా చేయాలి

( మొదటి పేజీ తరువాయి )

వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు.



రాజన్న ఆశయాలబాటలో...

# నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం శెట్టు బత్తుల బ్రదర్స్

## సేవలో ముందడుగు.. విశ్వసనీయతలో ప్రత్యేక స్థానం

మహా స్పెషల్



యాళ్ల జగదీశ్.. వరుపులరాజా.. సన్నిహితుడు









**ప్రత్తిపాడు(కాకినాడ జిల్లా), మహా :** రాజకీయాల్లో పదవులు మారొచ్చు.. పరిస్థితులు మారొచ్చు.. కానీ ఒకసారి ఇచ్చిన మాటకు కట్టుబడి, నాయకుడిపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే వ్యక్తులే నిజమైన కార్యకర్తలుగా, నాయకులుగా గుర్తింపు పొందుతారు. అలాంటి నమ్మకానికి, సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తున్నారు శెట్టు బత్తుల బ్రదర్స్. పదవి లేకున్నా ప్రజల్లో పలుకుబడి.. ప్రచారం లేకున్నా సేవలో ముందడుగు.. అవసరం వచ్చినప్పుడు మాత్రం ముందుగా స్పందించే మనస్తత్వం వీరి ప్రత్యేకతగా స్థానికులు పేర్కొంటున్నారు.

**రాజన్నతో అనుబంధం..**

దివంగత నేత వరుపుల జోగిరాజు రాజన్నతో శెట్టు బత్తుల బ్రదర్స్‌కు సన్నిహిత అనుబంధం ఉంది. రాజన్నతో కలిసి ఎన్నో ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటూ.. ఆయన ఆలోచనా విధానాన్ని దగ్గరగా చూసిన వారిలో వీరూ ఉన్నారు. రాజన్నకు అత్యంత సన్నిహితుడిగా, ఆయన రాజకీయ ప్రయాణంలో నమ్మకమైన అనుచరుడిగా ఉన్న యాళ్ల జగదీష్ తోనూ వీరి అనుబంధం కొనసాగుతోంది. రాజన్న లేని లోటు ఉన్నప్పటికీ.. ఆయన చూపించిన ప్రజా సేవా మార్గం మాత్రం ఆగకూడదనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. రాజన్న రాజకీయాల్లో ఉన్న సమయంలో ఒక కార్యక్రమం అంటే కేవలం రాజకీయ సభగా కాకుండా.. ప్రజల సమస్యలను తెలుసుకునే వేదికగా భావించే వారని ఆయన అనుచరులు గుర్తుచేస్తారు. మెడికల్ క్యాంపులు కావచ్చు.. గ్రామ సభలు కావచ్చు.. పేద కుటుంబాలకు సహాయం కావచ్చు.. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో రాజన్నతో పాటు శెట్టు బత్తుల బ్రదర్స్ కనిపించేవారు. "మనిషికి అండగా నిలవాలి.. కష్టంలో ఉన్నప్పుడు తోడుగా ఉండాలి" అనే ఆలోచనను రాజన్న నుంచి నేర్చుకున్నామని వారు చెబుతారు.

**బజగదీష్ అన్నకు నమ్మకమైన బలగం**

పార్టీ కార్యక్రమం అయినా.. కార్యకర్త సమస్య అయినా.. గ్రామంలో ప్రజా సమస్య అయినా.. స్పందించడంలో శెట్టు బత్తుల బ్రదర్స్ ముందుంటారని కార్యకర్తలు చెబుతున్నారు. కీలకనేత యాళ్ల జగదీష్ తో ఉన్న అనుబంధం కూడా సంవత్సరాలుగా కొనసాగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. "సమస్య ఏదైనా ముందు మన వాళ్లకు అండగా నిలవాలి" అనే భావనతో కార్యకర్తల మధ్య సమన్వయం చేస్తూ.. అవసరమైన చోట సహాయం అందిస్తూ ముందుకు సాగుతున్నారు.

**పదవి లేకున్నా.. ప్రజల్లో ప్రత్యేక స్థానం**

వీరి ప్రత్యేకత ఏమిటంటే.. అధికారిక పదవి కోసం ఎదురు చూడరు. తమకు ఉన్న పరిచయాలు, వనరులు, సమయాన్ని ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించాలనే ఆలోచనతో పనిచేస్తున్నారు. పదవి ద్వారా వచ్చే గౌరవం ఒకటి.. మనిషికి కష్టం వచ్చినప్పుడు పక్కన నిలబడటం ద్వారా వచ్చే గౌరవం మరొకటి అనే భావనతోనే వీరి సేవా ప్రయాణం సాగుతోంది. అందుకే స్థానికంగా పలువురు వీరిని రాజకీయ నాయకులుగా మాత్రమే కాకుండా.. అవసర సమయంలో అందుబాటులో ఉండే కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారు.

**వ్యాపారంలో విజయం.. సేవలో బాధ్యత**

శెట్టు బత్తుల బ్రదర్స్ వ్యాపార రంగంలోనూ తమకంటూ గుర్తింపు సాధించారు. తమ కష్టంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు.. దాని ద్వారా అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వ్యాపారం ద్వారా ఉపాధి.. సేవ ద్వారా భరోసా అనే రెండు మార్గాల్లో ముందుకు సాగుతున్నారు. పేద విద్యార్థులకు విద్యా సహాయం, పుస్తకాలు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు అందించడం.. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం.. అవసరమైన వారికి వైద్య సహాయం అందించడం.. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి సహకరించడం.. పండుగల సందర్భంగా పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు అందించడం.. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం.. వృద్ధులు, నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం..

ఇలా తమకు సాధ్యమైన ప్రతి మార్గంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. సేవా కార్యక్రమం చేసిన తర్వాత ఫొటోలు, ప్రచారం కోసం కాకుండా.. అవసరమైన వ్యక్తికి సహాయం చేరిందా లేదా అన్నదే ముఖ్యమని భావించే విధానం వీరిలో కనిపిస్తుందని స్థానికులు చెబుతున్నారు. ప్రజలకు అవసరం ఉన్నప్పుడు కనిపించడం.. కష్టం తీరే వరకు అండగా ఉండడం తమ బాధ్యతగా భావిస్తున్నారు. అందుకే వీరి సేవా కార్యక్రమాల్లో ఆర్భాటం కంటే ఆచరణకే ప్రాధాన్యత ఉంటుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

**రాజన్న కల.. సత్యప్రభ రాజా అభివృద్ధి బాట**

ప్రత్తిపాడు నియోజకవర్గం అభివృద్ధిలో ముందుండాలన్నది రాజన్న ఆశయాల్లో ఒకటిగా ఆయన అనుచరులు చెబుతుంటారు. ప్రస్తుతం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో.. వాటికి ప్రజల్లో మరింత చేరువ కల్పించేందుకు శెట్టు బత్తుల బ్రదర్స్ తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటించినప్పుడు కార్యకర్తలను సమన్వయం చేయడం.. ప్రజల సమస్యలను తెలుసుకోవడం.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం.. అవసరమైన చోట సహకరించడం వంటి కార్యక్రమాల్లో ముందుంటున్నారు. రాజన్న ఆశయం.. సత్యప్రభ రాజా గారి అభివృద్ధి బాట.. కార్యకర్తల కష్టం.. ప్రజల అవసరం — ఈ నాలుగు అంశాలను అనుసంధానించే ప్రయత్నంలో శెట్టు బత్తుల బ్రదర్స్ పాత్ర కనిపిస్తోంది. గ్రామంలో ఎవరికైనా కష్టం వస్తే.. "మేమున్నాం" అంటూ ముందుకు రావడం వీరి మరో ప్రత్యేకతగా స్థానికులు చెబుతున్నారు. కార్యకర్తకు వ్యక్తిగత సమస్య వచ్చినా.. పేద కుటుంబానికి ఆర్థిక ఇబ్బంది ఎదురైనా.. అత్యవసర వైద్య పరిస్థితి వచ్చినా.. తమ పరిధిలో సహాయం అందించేందుకు ముందుకు వస్తుంటారు. అర్ధరాత్రి ఫోన్ వచ్చినా స్పందించాలి.. అవసరమైతే అక్కడికే వెళ్లాలి.. సమస్య పరిష్కారం అయ్యే వరకు తోడుగా ఉండాలి అనే విధానంతో పనిచేస్తున్నారని వారి సన్నిహితులు చెబుతున్నారు.

**సేవలో మరో అడుగు..**

స్వాతంత్ర్య దినోత్సవం, రాజన్న వర్ధంతి వంటి సందర్భాల్లో భారీ అన్నదానాలు, రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఇవి కేవలం ఒక రోజు కార్యక్రమాలుగా కాకుండా.. ప్రజలతో తమ అనుబంధాన్ని మరింత బలపరిచే సేవా కార్యక్రమాలుగా కొనసాగిస్తున్నారు. రాజకీయాల్లో ఎవరికి ఎంత పదవి ఉందన్నది ఒక వైపు.. ప్రజల మధ్య ఎవరికి ఎంత నమ్మకం ఉందన్నది మరో వైపు. ఆ విషయంలో శెట్టు బత్తుల బ్రదర్స్ పేరు ప్రత్యేకంగా వినిపిస్తోంది. "రాజన్న తర్వాత మాకు ధైర్యం ఇచ్చిన పేర్లలో జగదీష్ అన్న ఒకరు.. ఆయనతో పాటు శెట్టు బత్తుల అన్నలు కూడా మా కష్టాల్లో ముందుంటారు" అని పలువురు కార్యకర్తలు చెబుతున్నారు. అందుకే వీరిని చాలామంది రాజకీయ అనుచరులుగా కాకుండా.. తమ కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రాజన్న నేర్పిన సేవా స్ఫూర్తి.. జగదీష్ అన్న చూపిస్తున్న నాయకత్వం.. సత్యప్రభ రాజా గారి అభివృద్ధి బాట.. ప్రజలు, కార్యకర్తలతో ఆ అనుబంధాన్ని కొనసాగిస్తున్న శెట్టు బత్తుల బ్రదర్స్.. ఈ నాలుగు అంశాల మధ్య ఒక బలమైన అనుబంధం కనిపిస్తోంది. రాజన్న భౌతికంగా దూరమైనా.. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే వారిలో తమ వంతు పాత్ర ఉండాలనే లక్ష్యంతో శెట్టు బత్తుల బ్రదర్స్ కొనసాగుతున్నారు. వ్యాపారంలో ఎదుగుదల.. సేవలో బాధ్యత.. నాయకత్వంపై విశ్వాసం.. ప్రజలపై ఆప్యాయత.. కార్యకర్తలపై అండ.. ఇవే శెట్టు బత్తుల బ్రదర్స్ ప్రయాణానికి బలమైన పునాదులు. రాజన్న చూపించిన సేవా మార్గం.. జగదీష్ అన్నతో కొనసాగుతున్న విశ్వాసం.. సత్యప్రభ రాజా గారి అభివృద్ధి బాటకు సహకారం.. ప్రజలతో విడదీయరాని అనుబంధం. ఇదే శెట్టు బత్తుల బ్రదర్స్ ప్రత్యేకత. రాజన్న ఆశయాలు కేవలం జ్ఞాపకాలుగా మిగలకుండా.. వాటిని ఆచరణలో కొనసాగించే వ్యక్తులు ఉన్నంతకాలం ఆయన ఆశయాలు సజీవంగానే ఉంటాయి. ఆ సేవా ప్రయాణంలో శెట్టు బత్తుల బ్రదర్స్ ఒక బలమైన అడుగు.. ఒక నమ్మకమైన పేరు.. ఒక విశ్వసనీయమైన అనుబంధం

# స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ

**ఏపీ అసెంబ్లీలో చంద్రబాబు ప్రకటన**



**అమరావతి, మహా:** "పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ కేబినెట్ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని సీఎం ప్రకటించగానే సభ "జయహో బీసీ" నినాదాలతో దద్దరిల్లింది. ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించుకుందని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లను బీసీలకు వర్తింపజేయనున్నట్టు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం స్ఫూర్తితో, నిబంధనలకు లోబడే ఈ పెంపును అమలు చేస్తున్నామని వివరించారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని ఆయన సభకు గుర్తుచేశారు. ఈ 34 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు.

# 2029లో మళ్ళీ మనమే 117 సీట్లతో అధికారంలోకి వస్తాం

( మొదటి పేజీ తరువాయి )

సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం నిత్యం స్ఫూర్తి నింపేలా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలన్నారు. 2029లో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమావ్యక్తం చేశారు. నేత, గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ పొలాలు ఎక్కడున్నా ఈత, తాటిచెట్లు పెంచాలని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని పెంచితే కల్తీ లేని కల్లు వస్తుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్ల వెంబడి నాటాలన్నారు. కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ అఘోరాలతో చేతబడులు చేయించారని ఆరోపించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.



# ఏజన్సీ ప్రజలకు అందని ప్రభుత్వ వైద్యం

**కారేపల్లి, మహా:** ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం వైద్య సేవలు అందటం లేదని, వైద్య సేవలందించాలనే ఆలోచనకూడా ప్రభుత్వానికి ఉన్నట్లుకనిపించటం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం కారేపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ని సీపీఐ(ఎం) బృందం సందర్శించి సమస్యలపై సర్వే నిర్వహించింది. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది, మందుల లభ్యత, వైద్య పరికరాలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో పేద, గిరిజన ప్రజలు ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్ రే, రోగ నిర్ధారణ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పేదలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కారేపల్లి మండల ప్రజల వైద్య అవసరాల దృష్ట్యా కారేపల్లి పీహెచ్సీ ని సీహెచ్సీ గా అప్ గ్రేడ్ చేసి 50 పడకలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ ఉన్న ప్రభుత్వ ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదన్నారు. కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన వైద్యులు, సిబ్బంది, మందులు, వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



# అర్హత కలిగిన ఓటరు పేరు తప్పిపోకుండా చూడాలి.!

**ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వై శ్రీనివాసరెడ్డి**
**డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌పై బిఎల్ఓలకు అవగాహన సమావేశం**

ఇబ్రహీంపట్నం ఆగస్టు 18 మహా: ఆదిభట్ల సర్కిల్-15 పరిధిలోని రాగన్నగూడ కార్యాలయంలో మంగళవారం డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ పై బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, సూపర్‌వైజర్ కోఆర్డినేటర్లకు, ఆర్డీఓ, డిసిలు ముఖ్యమైన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, ఈఆర్వో డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి, ఏఈఆర్ఓలు పాల్గొని, డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచురణ అనంతరం చేపట్టాల్సిన చర్యలు, ఓటర్లకు నోటీసుల జారీ, క్లెయిమ్స్ ఆబ్జెక్షన్స్ స్వీకరణ, హియరింగ్ ప్రక్రియ బిఎల్ఓ యాప్ లో వివరాల నమోదు వంటి అంశాలపై సిబ్బందికి సమగ్రంగా వివరించారు. ఈనెల 17న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచురించబడిందని, అక్టోబర్ 1న క్వాలిఫై తేదీగా పరిగణించబడుతుందని అధికారులు తెలిపారు. పేరు చేర్పు, తొలగింపు లేదా వివరాల సవరణకు సంబంధించిన క్లెయిమ్స్ ఆబ్జెక్షన్ ను వచ్చే నెల 16 వరకు సమర్పించాలని వివరించారు. ప్రతి బిఎల్ఓ, బిఎల్ఓ సూపర్వైజర్, సూపర్వైజర్ కోఆర్డినేటర్ తమ పరిధిలోని ప్రక్రియను సమన్వయంతో నిర్వహిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఓటరుకు అవకాశం కల్పించడం, నోటీసులు సక్రమంగా అందజేయడం, క్లెయిమ్స్ ఆబ్జెక్షన్ ను నిబంధనల ప్రకారం నిర్వహించి, ఇయర్రింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం ప్రధాన బాధ్యతగా తీసుకోవాలని, ఇబ్రహీంపట్నం ఆర్డీవో వై శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ, ఆదిభట్ల సర్కిల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రక్రియలో ఎటువంటి అర్హత కలిగిన ఓటరు పేరు తప్పిపోకుండా, తప్పు లేదా అనర్హమైన నమోదులను నిబంధనల ప్రకారం పరిశీలిస్తూ ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.

# పారిశుధ్య నిర్వహణలో అలసత్వానికి తావు లేదు

**శానిటేషన్ పనులను ఆకస్మికంగా పరిశీలించిన బల్దియా కమిషనర్ టి.వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా ;** గ్రేటర్ వరంగల్ నగర వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న ఆదేశించారు.మంగళవారం నగరంలోని 39వ డివిజన్ జన్మభూమి జంక్షన్ ప్రాంతంలో కమిషనర్ ఆకస్మికంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనుల నిర్వహణ, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించి, శానిటరీ జవాన్లు, సిబ్బందితో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుధ్య పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.డివిజన్‌లో స్వచ్ఛ ఆటోలు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఇంటింటికీ వస్తున్నాయా? అని స్థానికులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్న కమిషనర్.. గృహాల నుంచి సేకరించే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేర్వేరుగా సేకరించాలని స్పష్టం చేశారు. చెత్త వేరు చేసి అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యర్థాల ◌కేరణలోఎలాంటినిర్లక్ష్యంవహించవద్దని అధికారులను ఆదేశించారు.తనిఖీల్లో భాగంగా రోడ్డుపక్కన కన్స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ (C&D) వ్యర్థాలు పేరుకుపోయి ఉండటాన్ని కమిషనర్ గమనించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను రోడ్డుపై వేసిన భవన యజమానిపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై శానిటరీ జవాన్‌ను ఆరా తీశారు. సంబంధిత భవన యజమానికి జరిమానా విధించడంతో పాటు C&D వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.అనంతరం హంటర్ రోడ్ లోని ఏ ఎస్ ఎం కళాశాల వద్ద స్వీపింగ్ మిషన్ల పనితీరును పరిశీలించిన కమిషనర్, పారిశుధ్య పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన పారిశుధ్య నిర్వహణను నిరంతరం కొనసాగించాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీల్లో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా. రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు నరేందర్, గోల్కొండ శ్రీను, డిప్యూటీ ఇంజనీర్ రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భీమయ్య తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శం

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే కె. ఆర్ నాగరాజు**



**వvరంగల్, బ్యూరో మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జెడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ. పుష్పలత, సహాయ అధికారి శంకరయ్య తో పాటు గౌడ కుల సంఘ నాయకులు చిర్ర రాజు గౌడ్, గట్టు రమేష్ గౌడ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, అనంత రమేష్ గౌడ్, లక్ష్మణ్, జనగాం శ్రీనివాస్ గౌడ్ తదితరులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. బహుజనుల కోసం పోరాడి, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఒక చరిత్ర అని పేర్కొన్నారు. గౌడ కులంలో జన్మించిన పాపన్న గౌడ్ బహుజనుల కోసం పాలకులను ఎదిరించి, స్వరాజ్యాన్ని స్థాపించి ప్రజలకు సేవ చేశారని తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, సేవలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌడ కుల సంఘ నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్న విచారణ ఖైదీల విముక్తి ఎప్పుడు?



నేరాలు చేశారో చేయలేదో తెలియదు కానీ ఏండ్లకు ఏండ్లు జైలు నాలుగు గోడల మధ్య శిక్ష ఖరారు కాకముందే విచారణ ఖైదీలుగా శిక్షలు అనుభవిస్తున్నారు. దేశవ్యాప్తంగా చత్తీస్ గడ్, జగదల్పూర్ , రాయపూర్, విలాస్పూర్, సుకుమా, బీహార్, జార్ఖండ్ ,నాగపూర్, బీహార్, ఒడిస్సా భువనేశ్వర్, తమిళనాడు, నాగ్ పూర్, చర్లపల్లి, విశాఖపట్నం, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ ప్రధాన జైళ్ళలో సుమారు 6000 మంది ఖైదీలు మావోయిస్టులపై విచారణ ఖైదీలు గానే పది సంవత్సరాల నుండి 15 సంవత్సరాలుగా జైలు నాలుగోడల మధ్య బందీలుగా నలిగిపోతున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్నటువంటి మావోయిస్టు రాజకీయ ఖైదీలను బే షరతుగా కేసులను ఎత్తివేసి విడుదల చేయాలని హక్కుల సంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి. ప్రొఫెసర్ హరగోపాల్ , ప్రొఫెసర్ కోదండరాం , ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ హక్కుల సంఘాల నేతలు ప్రజాస్వామికవాదులు న్యాయకోవిదులు, న్యాయవాదులు, ప్రజాసంఘాల నేతలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. జైలు శిక్ష పడక ముందే విచారణ ఖైదీలుగా జైలు నాలుగు గోడల మధ్య ఉండిపోతున్నారు. అటు భార్య పిల్లలకు ఇటు కన్న తల్లిదండ్రులకు దూరమై బ్రతుకు భారమై బిక్కుబిక్కుమంటూ జైలు నాలుగు గోడల మధ్య నిత్యం అనుక్షణం నరకం అనుభవిస్తున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఆరుగురు గత 15రోజులుగా బీహార్ సెంట్రల్ జైల్లో విజయ్ కుమార్ , ఆర్య .మోహిత్, జనార్ధన్ సంజయ్ దీపక్ రావు చంచల్ గూడ సెంట్రల్ జైలులలో విచారణ ఖైదీలు గానే ఉంటున్నారు. సంజయ్, దీపక్ రావు చర్లపల్లి సెంట్రల్ జైల్లో 10 రోజులు నిరాహార దీక్షలు చేసి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించారు. రాజకీయ ఖైదీల డిమాండ్లను పరిష్కరించేంతవరకు ఆమరణ నిరాహార దీక్ష నుండి విరమించేది లేదని ససేమిరా అన్నారు. ముఖ్యంగా చత్తీస్ గడ్, జగదల్పూర్ భువనేశ్వర్, రాయపూర్, సుకుమా జైళ్లలో సుమారు 6000 మంది ఖైదీలు ఉంటారని వారందరినీ విడుదల చేయాలని దేవ్ జీ అలియాస్ తిపిరి తిరుపతి , మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ దాదా ప్రభుత్వం ముందు 6000 మంది ఖైదీలను ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని తమ డిమాండ్లను ప్రతిపాదించారు. దీనికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది కానీ ఇంతవరకు ఏ ఒక్కరిని కూడా విడుదల చేయలేదు. ఆగస్టు 15, 2026న ఆయా రాష్ట్రాలలో తొలి దశగా వెయ్యి మంది ఖైదీలను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అట్టి హామీని విస్మరించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన శిరీష ఆర్కే సహచరిణి, మేడం బాలకృష్ణ సహచరిణి అనురాధ, చతిస్ గడ్ జై ళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. జార్ఖండ్ కు చెందిన అశుతోష్ మావోయిస్టు పార్టీ సభ్యుడు రాంచీలో కేసు విషయంలో ఆలస్యం చేస్తున్నారని అతని న్యాయవాది ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన తిరుమలగిరి కి చెందిన కోసపు అశోక్ రెడ్డి, తోపాటు సహచరిణి ఆశ, జగదల్ పూర్ మధ్యప్రదేశ్ జైళ్ళలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఇదే అశోక్ రెడ్డి పై జార్ఖండ్ జైల్లో జైలు అధికారులు విచక్షణారహితంగా దాడి చేశారు. విశాఖపట్నం రాజమండ్రి కాకినాడ చర్లపల్లి, చంచల్గూడా జైళ్ళలో సుమారు 80 మంది మావోయిస్టు ఆరోపణలపై జైళ్లలో మగ్గుతున్నారు . మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ బ్యూరో సభ్యుడు కిషన్ దాదా జార్ఖండ్ జైల్లో అనారోగ్యంతో వృద్ధాప్యంతో జైలు నాలుగు గోడల మధ్యన తుది శ్వాస విడిచారు. కిషన్ దాదా సహచరిణి ఝార్ఖండ్ కు చెందిన గీతు నాలుగు గోడల మధ్యనే రిమాండ్ ఖైదుగా ఉన్నారు. తెలుగు దీపక్ కలకత్తా జైల్లో, మరో దీపక్ తమిళనాడు రాష్ట్ర కమిటీ సభ్యుడు చత్తీస్ గడ్ ఆసుపత్రిలో అరెస్టయ్యాడు. తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ భార్య రజిత ఆశన్న సహచరిణి శ్రీవిద్య చెంచలగూడ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. శివారెడ్డి అలియాస్ కిరణ్ వేంగు దాదా కూడా విశాఖపట్నం జైల్లో చర్లపల్లి జైల్లో విచారణ ఖైదీలుగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన దుబాసి శంకర్ అలియాస్ మహేందర్ రమేష్ గత ఏడు సంవత్సరాలుగా భువనేశ్వర్ జైల్లో విచారణ ఖైదీగా ఉన్నారు. దుబాయ్ సి శంకర్ ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తున్నది. 2017లో రామడుగు ఎన్కౌంటర్లో దుబాసి శంకర్ భార్య లత. అలియాస్ భారతి చనిపోయింది. దుబాషి శంకర్. సొంత కోడలు స్వప్న విశాఖపట్నం మహిళా సెంట్రల్ జైల్లో ఎన్ఐఏ కేసులో ఐదు సంవత్సరాలు విశాఖపట్నం కోర్టు శిక్ష విధించింది. ఇందులో కందమాల్ కలహంజా నవపాడ జైళ్లలో మావోయిస్టు రాజకీయ ఖైదీలు 1000 మందికి పైగానే విచారణ ఖైదీలుగా ఉన్నారు. సుప్రీం కోర్టు విచారణ ఖైదీలుగా శిక్ష పడకముందే ఉండవద్దని ఒక జడ్జిమెంట్ను ఇచ్చింది. మరి కొంతమంది ఖైదీలను శిక్షలు పడ్డ ఖైదీలను కూడా వారికి కూడా ప్రతి మూడు నెలలకు ఒకసారి గాంధీ జయంతి పంద్రాగస్టు రిపబ్లిక్ డే రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా క్షమాబిక్షలు ప్రసాదించి విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆయా రాష్ట్రాల జైళ్లకు మార్గదర్శకాలను 2026 లో విడుదల చేసింది. ఆదివాసి ఖైదీలు జైల్లో బెయిలు రాకుండానే వారి జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. జైళ్లలో సరిగా వైద్యమందక చనిపోతున్నారు. న్యాయమూర్తి శిక్షలు వేయకుండానే ఏళ్లకు ఏళ్లు జైల్లో మధ్య నలిగిపోతున్నారు. జైలు పరివర్తనాలయాలుగా ఉండాల్సింది పోయి మృత్యు కూపాలుగా మారుతున్నాయి. భువనేశ్వర్ జైల్లో 20 21 లో రవి దూల అనే ఆదివాసి ఖైదీ గుండెపోటుతో చనిపోయారు. అతడిని నయా గుడి దాడి కేసులో నిందితునిగా పోలీసులు చేర్చారు. కోర్టు మాత్రం రవిదూలను నిర్దోషిగా ప్రకటించింది. 2018 లో దండుకొర అనే ఆదివాసి ఖైదీ మల్కన్గిరి జైల్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగరాజు, పిట్ట మర్రి గ్రామస్థుడు మల్కనగిరి జిల్లా ఒడిస్సా రాష్ట్రం. విశాఖపట్నం సెంట్రల్ జైల్లో 2012లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినాడు. మూకసోడి కొలకోట గ్రామం వైద్యం అందక చనిపోయాడు. దూల కోడి టేక్ గూడ గ్రామం మల్కనగిరి జైల్లో 2015 లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నిర్మల మహారాష్ట్ర నాగపూర్ జైల్లో2022 లో వైద్య మందక చనిపోయింది. ఇలా ఎంతోమంది విచారణ ఖైదీలు శిక్షలు పడకుండానే విచారణ ఖైదీలు జైలు నాలుగు మధ్య తుది శ్వాస విడుస్తున్నారు. పోలీసులు థర్డ్ డిగ్రీ వినియోగిస్తున్నారని పౌర హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. దేశంలో మావోయిస్టు పార్టీ లేనప్పుడు మావోయిస్టు సానుభూతిపరులు. ఆదివాసులు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు నేతలను, వృద్ధ మావోయిస్టులను ఏళ్ల తరబడి జైల్లో పెట్టినప్పటికీ. వారికి బెయిల్ రాకుండా అక్కడే ఉండి పోతున్నారు. ఆయా జైల్లో సామర్థ్యం మించి ఎక్కువ మంది ఖైదీలను ఉంచుతున్నారని ఆరోపణలున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మానవతా దృక్పథంతో ఏళ్ల తరబడి జైలు నాలుగు గోడల మధ్య నలిగిపోతున్న ఆదివాసి మావోయిస్టు రాజకీయ ఖైదీలను విడుదల చేసి ప్రభుత్వాలు మానవతా దృక్పథాన్ని చాటుకోవాలి.

**- దామరపల్లి నర్సింహారెడ్డి**

# పసిడి పట్టులో ఐరోపా దేశాలు

**హైదరాబాద్, మహా :** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డాలర్ లేదా మరే ఇతర కరెన్సీ కంటే బంగారానికే అత్యంత విశ్వసనీయత ఉంటుంది. ఆర్థిక మాంద్యం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం వంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశాల ఆర్థిక వ్యవస్థలను కుప్పకూలకుండా కాపాడే బ్రహ్మాస్త్రం బంగారమే. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు భారీ ఎత్తున బంగారాన్ని తమ ఖజానాల్లో నిల్వ చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఐరోపా (యూరప్) ఖండంలోని అగ్ర దేశాలు పసిడి నిల్వల్లో ఇతర ఖండాల దేశాలకు గట్టి పోటీనిస్తున్నాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ , అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలు 2026 నాటికి సంబంధించి వెలువరించిన తాజా గణాంకాలను బట్టి చూస్తే.. ఐరోపా దేశాలు తమ ఆర్థిక భద్రత కోసం బంగారాన్ని ఎంతలా నమ్ముకున్నాయో ఇట్టే అర్థమవుతుంది. పశ్చిమ ఐరోపాలోని సంపన్న దేశాల నుంచి తూర్పు ఐరోపాలోని చిన్న దేశాల వరకు ప్రతి ఒక్కరూ తమ పసిడి నిల్వలను పెంచుకోవడంపై తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

**పసిడి పీఠంపై జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్**

యూరప్ ఖండంలో అత్యధిక బంగారు నిల్వలు కలిగిన దేశంగా జర్మనీ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఆ దేశం వద్ద ఏకంగా 3,350 టన్నుల బంగారు నిల్వలు ఉన్నాయి. ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన జర్మనీ, సంక్షోభ సమయాల్లో తమ కరెన్సీకి దన్నుగా నిలిచేందుకు ఈ స్థాయిలో పసిడిని నిల్వ చేస్తోంది. ఆ తర్వాతి స్థానాల్లో ఇటలీ 2,452 టన్నులతో రెండో స్థానంలో, ఫ్రాన్స్ 2,437 టన్నులతో మూడో స్థానంలో నిలిచాయి. ఈ రెండు దేశాలు చారిత్రకంగా పసిడికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంటాయి. ఇక పాశ్చాత్య దేశాల ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యా వ్యూహాత్మకంగా డాలర్లపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, 2,283 టన్నుల బంగారాన్ని పోగుచేసుకుని యూరప్‌లో నాలుగో స్థానంలో సుస్థిరంగా నిలబడింది.

**సేఫ్ హెవెన్ స్విట్జర్లాండ్.. పోలాండ్ దూకుడు***

ప్రపంచ కుబేరుల సంపదకు, బ్యాంకింగ్ రహస్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే స్విట్జర్లాండ్ 1,040 టన్నుల స్వర్ణ నిల్వలతో తన ఆర్థిక స్థిరత్వాన్ని చాటుకుంటోంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ జాబితాలో పోలాండ్ (632 టన్నులు) నెదర్లాండ్స్ (612 టన్నులు), టర్కీ (531 టన్నులు) లాంటి దేశాల కన్నా వేగంగా తన బంగారు నిల్వలను పెంచుకుంటోంది. ముఖ్యంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత తూర్పు ఐరోపా సరిహద్దుల్లో నెలకొన్న అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని పోలాండ్ తన కేంద్ర బ్యాంకు ద్వారా భారీగా పసిడిని కొనుగోలు చేస్తోంది. ఒకప్పటి వలస సామ్రాజ్యాలైన పోర్చుగల్ (383 టన్నులు), బ్రిటన్ (310 టన్నులు), స్పెయిన్ (282 టన్నులు) కూడా తమ దేశ ఆర్థిక బలాన్ని ప్రదర్శించేందుకు గణనీయమైన స్థాయిలో పసిడిని అట్టిపెట్టుకున్నాయి. ఆస్ట్రియా (280 టన్నులు), బెల్జియం (227 టన్నులు) కూడా గౌరవప్రదమైన నిల్వలతో తమ దేశాల భవిష్యత్తును సురక్షితం చేసుకున్నాయి.

**చిన్న దేశాల భారీ ముందుచూపు**

బంగారం నిల్వలు అనగానే కేవలం ఆర్థిక అగ్రరాజ్యాలకే పరిమితం కాలేదు. స్వీడన్ (126 టన్నులు), గ్రీస్ (115 టన్నులు), హంగరీ (110 టన్నులు), రొమేనియా (104 టన్నులు) లాంటి దేశాలు కూడా తమ వనరుల పరిధిలో భారీగానే పసిడిని కూడబెట్టాయి. దశాబ్దాల క్రితం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని చవిచూసిన గ్రీస్ లాంటి దేశాలు ఇప్పుడు ముందస్తు భద్రతగా బంగారాన్ని ఆశ్రయించడం గమనార్హం. చెక్ రిపబ్లిక్ (82 టన్నులు), డెన్మార్క్ (66.5 టన్నులు), బెలారస్ (53.9 టన్నులు), సెర్బియా (53.8 టన్నులు), ఫిన్లాండ్ (43.8 టన్నులు) లాంటి దేశాలు సైతం అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకోవడానికి ఇదే బాటలో పయనిస్తున్నాయి. బల్గేరియా (41 టన్నులు), స్లొవేకియా (31.7 టన్నులు) కూడా తమదైన రీతిలో నిల్వలు పెంచుకుంటుండగా, యుద్ధంతో అతలాకుతలమైన ఉక్రెయిన్ సైతం 27.4 టన్నుల పసిడి నిల్వలతో తన ఆర్థిక వ్యవస్థను కాపాడుకునే పోరాటం చేయడం విశేషం.కాలం ఎంత మారుతున్నా, డిజిటల్ కరెన్సీలు, క్రిప్టోకరెన్సీలు ఎన్ని పుట్టుకొచ్చినా అంతర్జాతీయ వాణిజ్యంలో, కేంద్ర బ్యాంకుల మనుగడలో బంగారానిదే పైచేయి అని ఐరోపా దేశాల తాజా గణాంకాలు నిరూపిస్తున్నాయి. పశ్చిమ ఐరోపా దేశాలు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి పసిడిని సాధనంగా వాడుకుంటుంటే, తూర్పు ఐరోపా దేశాలు తమ భవిష్యత్తుకు భద్రతా కవచంగా మార్చుకుంటున్నాయి. మొత్తానికి కాగితపు కరెన్సీ ముద్రణపై ఉన్న నమ్మకం కంటే, వజ్రఖాయం లాంటి బంగారు బిస్కెట్లపైనే ఐరోపా దేశాలు అపారమైన విశ్వాసాన్ని ఉంచుతున్నాయని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు

# అర్జున అవార్డులను ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ, మహా :** క్రీడారంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అర్జున అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈసారి 17 మందికి అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో స్థిరమైన ప్రదర్శన కనబరిచిన క్రీడాకారుల పేర్లను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం, తుది జాబితాను ప్రకటించింది. 1962 ఆసియా గేమ్స్ స్వర్ణ పతక విజేత ఫుట్ బాల్ క్రీడాకారుడు ఐ. అరుమాయినాయగానికి జీవిత సాఫల్య అవార్డు దక్కింది. క్రీడా రంగంలో దేశంలోనే అత్యున్నత పురస్కారమైన 'మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న' అవార్డును ఈసారి ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం.

**చెస్ రంగంలో**

ఈ పురస్కారానికి చెస్ విభాగంలో భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోశ్ గుజరాతీని అవార్డు వరించింది. గత కొంతకాలంగా అంతర్జాతీయ టోర్నమెంట్లలో భారత్‌కు అద్భుత విజయాలను అందించడంలో విదిత్ సంతోశ్ కీలక పాత్ర పోషించారు. అలాగే, మహిళల విభాగంలో ఫిడే ప్రపంచ కప్‌లో అదరగొట్టిన దివ్య జితేంద్ర దేశ్‌ముఖ్ సైతం అర్జున అవార్డుకు ఎంపికయ్యారు. భారత్‌లో చెస్ క్రీడకు లభిస్తున్న ఆదరణకు ఈ అవార్డులే నిదర్శనం అని చెప్పవచ్చు. ఇక, మహిళల డబుల్స్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో అంచలంచెలుగా ఎదుగుతున్న పుల్లెల గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ జోడికి సంయుక్తంగా ఈ గౌరవం దక్కింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ కుమార్తె అయిన గాయత్రి, ట్రీసాతో కలిసి ప్రపంచ వేదికలపై కనబరిచిన ప్రతిభకు ఈ అవార్డు తగిన గుర్తింపుగా నిలిచింది. మరోవైపు, డెకాథ్లాన్, హైజంప్ విభాగంలో దేశానికి ఎన్నో పతకాలు తెచ్చిన తేజస్విన్ శంకర్‌కు ఈ అవార్డు లభించింది. అలాగే రేస్ వాకింగ్‌లో దేశ కీర్తిని పెంచిన ప్రియాంక గోస్వామి, ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో దూసుకుపోతున్న మహమ్మద్ అజ్మల్ కూడా ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో అవకాశం లభించింది. వీరితో పాటు నరేందర్ (బాక్సింగ్), లాల్‌రెమ్సియామి (హాకీ), రాజ్‌కుమార్ పాల్ (హాకీ), సుర్జీత్ (కబడ్డీ), పూజ (కబడ్డీ), రుద్రాంశ్ ఖండేల్‌వాల్ (పారాషూటింగ్), ఏక్తా భయన్ (పారాషూటింగ్), అరవింద్ సింగ్ (రోయింగ్), అఖిల్ షెరాన్ (షూటింగ్) అవార్డులను అందుకోనున్నారు. ఈ ఏడాది అవార్డుల ఎంపికలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, షూటింగ్, హాకీ, కబడ్డీ వంటి వివిధ క్రీడలకు సమాన ప్రాధాన్యం లభించింది. యువ క్రీడాకారులతో పాటు సీనియర్లకు కూడా ఈ జాబితాలో చోటు దక్కింది. భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, రిటైర్డ్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా అధ్యక్షతన ఏర్పాటైన ఎంపిక కమిటీ సిఫార్సుల ఆధారంగా పేర్లను ఎంపిక చేస్తారు. అయితే, వివిధ విభాగాల కింద క్రీడాకారులు, కోచ్‌లు సంస్థలకు పురస్కారాలు ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రిత్వ శాఖ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది.

# పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఆదివాసీ నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం



తెలంగాణలోని షెడ్యూల్డ్ ఏరియా ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం ఉపాధి అవకాశాలు మాత్రమే కావు అవి వారి సామాజిక, ఆర్థిక, విద్యా వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు రాజ్యాంగం కల్పించిన రక్షణలో ఒక ముఖ్యమైన భాగం. ప్రత్యేకించి పోలీస్ శాఖలోని కానిస్టేబుల్ నియామకాల విషయంలో షెడ్యూల్డ్ ఏరియా ఆదివాసీ అభ్యర్థులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించే విధానం గతంలో అమలులో ఉంది. 2022 తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో షెడ్యూల్డ్ ఏరియా పోలీస్ స్టేషన్లలోని 75% ఖాళీలను సంబంధిత షెడ్యూల్డ్ ఏరియాల్లో డొమిసైల్ ఉన్న గిరిజన తెగల అభ్యర్థులతో భర్తీ చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. అటువంటి ప్రత్యేక రక్షణను ప్రస్తుత నియామక ప్రక్రియలో స్పష్టంగా చూపించకపోతే అది ఆదివాసీ యువతలో సహజంగానే ఆందోళనకు దారి తీస్తుంది. షెడ్యూల్డ్ ఏరియా పోలీస్ స్టేషన్లలో స్థానిక ఆదివాసీ యువతకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించే విధానం కొత్తగా వచ్చినది కాదు. తెలంగాణలో గత పోలీస్ కానిస్టేబుల్ నియామక నిబంధనల్లో షెడ్యూల్డ్ ఏరియా పోలీస్ స్టేషన్లలోని 75% కానిస్టేబుల్ పోస్టులను ఆయా షెడ్యూల్డ్ ఏరియాల్లో నివసించే గిరిజన తెగల అభ్యర్థులతో భర్తీ చేసే విధానం పేర్కొనబడింది. 2018 నియామక నోటిఫికేషన్‌లో కూడా ఇదే విధానం స్పష్టంగా నమోదైంది. 2022 నోటిఫికేషన్‌లో ఈ ప్రత్యేక నిబంధనను మరింత విస్తరించి, అప్పటి సంబంధిత షెడ్యూల్డ్ ఏరియా పోలీస్ స్టేషన్లను అనేక జిల్లాలతో పేర్కొన్నారు. అందువల్ల ఈ ప్రత్యేక హక్కును కేవలం సాధారణ ఎస్టీ రిజర్వేషన్‌గా చూడకూడదు. షెడ్యూల్డ్ ఏరియా స్థానిక ఆదివాసీ నిరుద్యోగ యువతకు కల్పించిన ప్రత్యేక రక్షణగా చూడాలి. సాధారణ ఎస్టీ రిజర్వేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ అభ్యర్థులకు వర్తించే సామాజిక రిజర్వేషన్. కానీ షెడ్యూల్డ్ ఏరియాల్లోని ప్రత్యేక రిజర్వేషన్ లక్ష్యం భిన్నమైనది. షెడ్యూల్డ్ ఏరియా స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం. స్థానిక పరిపాలనలో స్థానిక ఆదివాసులకు ప్రాతినిధ్యం పెంచడం. చారిత్రకంగా వెనుకబడిన ప్రాంతాల యువతకు అవకాశాలు కల్పించడం. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యవస్థపై స్థానిక సమాజానికి నమ్మకం పెంచడం. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ఉద్దేశ్యాలకు అనుగుణంగా గిరిజన సంక్షేమాన్ని ప్రోత్సహించడం. కాబట్టి 75% ప్రత్యేక నిబంధనను సాధారణ ST రిజర్వేషన్‌తో కలిపి చూడటం సరైన విధానం కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాల పరిపాలనకు 5వ షెడ్యూల్ వర్తిస్తుంది. 5వ షెడ్యూల్‌లో షెడ్యూల్డ్ తెగల సంక్షేమం, అభివృద్ధి మరియు వారి ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థను రాజ్యాంగం ఏర్పాటు చేసింది.

5వ షెడ్యూల్‌లో గవర్నర్‌కు షెడ్యూల్డ్ ఏరియాల పరిపాలనపై ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయి. అలాగే ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్ ద్వారా ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సలహా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. అందువల్ల షెడ్యూల్డ్ ఏరియాల్లో ఉద్యోగాలు, విద్య, భూమి, పరిపాలన వంటి అంశాలను సాధారణ ప్రాంతాలతో పూర్తిగా సమానంగా చూడకుండా, అక్కడి ప్రత్యేక సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**పోలీస్ శాఖలో స్థానిక ఆదివాసీ యువత ప్రాతినిధ్యం ఎందుకు అవసరం?**

షెడ్యూల్డ్ ఏరియా పోలీస్ స్టేషన్లు సాధారణ పోలీస్ స్టేషన్ల కంటే ప్రత్యేక సామాజిక, భౌగోళిక పరిస్థితుల్లో పనిచేస్తాయి స్థానిక ఆదివాసీ యువతకు స్థానిక భాషలు, మాండలికాలపై అవగాహన ఉంటుంది. గ్రామాలు, గూడేలు, కొండ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు తెలుసు స్థానిక ప్రజల జీవన విధానం, ఆచారాలు, సంప్రదాయాలపై అవగాహన ఉంటుంది. దూరప్రాంతాల్లో పోలీస్ సేవలను మరింత సమర్థవంతంగా అందించగలరు. కాబట్టి షెడ్యూల్డ్ ఏరియా పోలీస్ స్టేషన్లలో స్థానిక ఆదివాసీ యువతకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించడం సామాజిక న్యాయంతో పాటు పరిపాలనా పరంగా కూడా ప్రయోజనకరం. ప్రస్తుత పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో షెడ్యూల్డ్ ఏరియా పోస్టులకు సంబంధించి 75% ప్రత్యేక రిజర్వేషన్‌ను స్పష్టంగా పేర్కొనకపోతే, ఆదివాసీ అభ్యర్థులకు అనేక సందేహాలు ఏర్పడతాయి. షెడ్యూల్డ్ ఏరియా పోలీస్ స్టేషన్లలోని పోస్టులకు 75% ప్రత్యేక రిజర్వేషన్ కొనసాగుతుందా?కొనసాగితే నోటిఫికేషన్‌లో దానిని స్పష్టంగా ఎందుకు పేర్కొనలేదు? సంబంధిత పోస్టులు సాధారణ ST రిజర్వేషన్‌లోకి వెళ్తాయా? స్థానిక షెడ్యూల్డ్ ఏరియా ST డొమిసైల్ ప్రమాణాలు ఏమిటి? స్థానిక ఆదివాసీ అభ్యర్థులకు ప్రత్యేక రక్షణ ఎలా అమలు చేస్తారు? గత నియామకాల్లో ఉన్న ప్రత్యేక నిబంధనలను ప్రస్తుత నియామకంలో ఎలా కొనసాగిస్తున్నారు? ఉద్యోగ నోటిఫికేషన్ అనేది వేలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును నిర్ణయించే అధికారిక పత్రంలో పోస్టుల సంఖ్య, పోస్టుల విభజన, రిజర్వేషన్,స్థానిక అభ్యర్థుల అర్హత, షెడ్యూల్డ్ ఏరియా ప్రత్యేక నిబంధనలు,

డొమిసైల్ ప్రమాణాలు, వయోపరిమితి, శారీరక ప్రమాణాలు వంటి అంశాలు స్పష్టంగా ఉండాలి. ప్రత్యేక రిజర్వేషన్‌కు అర్హత ఉన్న ఆదివాసీ యువతకు నోటిఫికేషన్‌లో స్పష్టత లేకపోతే వారు దరఖాస్తు దశ నుంచే అనిశ్చితికి గురవుతారు. దీని ఫలితంగా ఏజెన్సీ ప్రాంతాలైన ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఉమ్మడి వరంగల్ జిల్లా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మొత్తం ఏడు జిల్లాలలో ఎస్టీ కేటగిరి లో 75% స్థానిక అభ్యర్థులకు రిజర్వేషన్ అమలు చేస్తే 682 ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. 2026 పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు విడుదల చేసిన నోటిఫికేషన్ లో ఎస్టి కేటగిరిలో 10% మాత్రమే రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. నియామకాలు చేపడితే 10%తో కేవలం 92 మంది ఎస్టి కేటగిరీలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. సుమారు 600 మంది ఆదివాసి నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతుంది.

ఆదివాసీ యువతకు పోలీస్ ఉద్యోగాల్లో అవకాశాలు తగ్గడం అంటే కేవలం కొన్ని ఉద్యోగాలు కోల్పోవడం కాదు దాని ప్రభావం.

నిరుద్యోగం, కుటుంబ ఆర్థిక స్థితి, విద్య, సామాజిక అభివృద్ధి. స్థానిక నాయకత్వం ప్రభుత్వ వ్యవస్థలో ప్రాతినిధ్యం వరకు ఉంటుంది. ఇప్పటికే విద్య, ఉపాధి, మౌలిక వసతులు, ఆర్థిక అవకాశాల విషయంలో షెడ్యూల్డ్ ఏరియా ప్రాంతాలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగం మరియు ప్రభుత్వ విధానాల ద్వారా ఏర్పడిన ప్రత్యేక ఉద్యోగ రక్షణను బలహీనపరచడం ఆదివాసీ యువతపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ అధికారికంగా ST రిజర్వేషన్ అమలు చేయడంతో పాటు షెడ్యూల్డ్ ఏరియాల్లో STలకు ప్రత్యేక రిజర్వేషన్ల అమలును తన బాధ్యతల్లో భాగంగా పేర్కొంది. అందువల్ల పోలీస్ నియామకాల్లో కూడా సంబంధిత ప్రత్యేక రిజర్వేషన్ అమలుపై గిరిజన సంక్షేమ శాఖ, హోం శాఖ మరియు పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు మధ్య స్పష్టమైన సమన్వయం ఉండాలి. కానీ తెలంగాణలో గిరిజన సంక్షేమ శాఖ అనేది ఉందా...! ఉంటే ఏ ప్రజల ప్రయోజనం కోసం పని చేస్తుంది. ఆదివాసులకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు మౌనంగా తమకు సంబంధం లేనట్లుగా గిరిజన శాఖ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివాసీ నిరుద్యోగ యువత ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. వారు తమకు రాజ్యాంగం, చట్టాలు మరియు ప్రభుత్వ నియామక నిబంధనల ద్వారా కల్పించిన హక్కులను మాత్రమే కోరుతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం “ఉద్యోగం అందరికీ సామాజిక న్యాయం అందరికీ” అనే సూత్రాన్ని ఆచరణలో చూపించాలి. షెడ్యూల్డ్ ఏరియా యువతకు ఉన్న ప్రత్యేక రిజర్వేషన్ విషయంలో ఎటువంటి అనుమానాలు లేకుండా అధికారికంగా స్పష్టత ఇవ్వాలి. షెడ్యూల్డ్ ఏరియా ఆదివాసీ నిరుద్యోగ యువతకు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించడం దయకాదు. అది సామాజిక న్యాయం, సమాన అవకాశాలు మరియు రాజ్యాంగ పరిరక్షణల లక్ష్యాలకు అనుగుణమైన చర్య. గతంలో తెలంగాణ ప్రభుత్వం పోలీస్ నియామకాల్లో 75% ప్రత్యేక నిబంధన అమలైన దాఖలాలు ఉన్నాయి 2015, 2018, 2022 నియామక పత్రాల్లో షెడ్యూల్డ్ ఏరియా పోలీస్ స్టేషన్లకు సంబంధించిన ఈ ప్రత్యేక విధానం స్పష్టంగా కనిపిస్తుంది.ప్రస్తుత 2026 పోలీస్ నియామక ప్రక్రియలో కూడా షెడ్యూల్డ్ ఏరియా ఆదివాసీ యువతకు వర్తించే ప్రత్యేక రిజర్వేషన్‌పై స్పష్టమైన అధికారిక ప్రకటన చేయడం అత్యవసరం. ఆదివాసీ యువతకు న్యాయం చేయాలి.షెడ్యూల్డ్ ఏరియా హక్కులను కాపాడాలి. 75% ప్రత్యేక రిజర్వేషన్‌ను స్పష్టంగా అమలు చేయాలి. రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించాలి. గతంలో ప్రస్తావించిన జీవో109, జీవో 49, జీవో 24 విషయాలను కూడా ఈ ఆర్టికల్‌లో చట్టపరమైన ఆధారాలతో ప్రత్యేక అధ్యాయంగా చేర్చవచ్చు. అయితే ఆ జీవోల అసలు పాఠ్యాలను నిర్ధారించకుండా వాటి ఆధారంగా ఖచ్చితమైన న్యాయవాదనలు చేయడం సరైంది కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ సమన్వయంతో షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియామకాల ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా నిర్వహించాలని ఆదివాసీ నిరుద్యోగ యువత తెలంగాణ ప్రజా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



**డా. సాగబోయిన పాపారావు**
**(ఎంఏ, పిహెచ్ డి, ఓయు)**
**ఆదివాసీ విద్యార్థి సంఘం**
**వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ,**
**సెల్ నెంబర్:9441288991**



# కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రాపర్టీ దొంగతనం కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం అధికారులు సిబ్బందితో స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ప్రాపర్టీ కేసులు దొంగతనం కేసుల వివరాలను అడిగి తెలుసుకొని పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించడంతో పాటు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి చోరీకి గురైన ఆస్తి రికవరీ దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలను వినియోగించే వారిని గుర్తించి వారికి డీఅడిక్షన్ కేంద్రాల ద్వారా పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్లు రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ సంబంధిత వ్యక్తుల కదలికలు కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను మరింత వేగవంతంగా పారదర్శకంగా అందించాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్‌తో పాటు నాట్ గ్రిడ్ గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ నేరాల ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెట్రోలింగ్ బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డయల్ 112కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, సీఐ సతీష్, ఎస్సైలు నాగరాజు, సాయి కిషోర్ రెడ్డి, విజయ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో గ్రీష్మకు సీటు..

**అభినందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు/పినపాక, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఊసం గ్రీష్మ తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో బీఏ ఎకనామిక్స్ కోర్సులో సీటు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రీష్మను ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత విద్యలో మరింతగా రాణించి మంచి భవిష్యత్తును సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల ఉన్నత విద్యకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పినపాక మండల అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు, పొట్లపల్లి సర్పంచ్ తాళ్ల గుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 18 మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , మాజీ ఎంపీ శ్రీ బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని బీర్ల అయిలయ్య , బూర నర్సయ్య గౌడ్ తోకలిసి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాపన్న గౌడ్ చేసిన పోరాటాన్ని, ఆయన ధైర్యసాహసాలను, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.విగ్రహావిష్కరణ అనంతరం రాజపేట మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలు, యువత, గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నాయకులు పాపన్న జీవిత చరిత్ర, ఆయన సామాజిక పోరాటం, సమాజంలో సమానత్వం కోసం చేసిన కృషిని వివరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక గొప్ప వీరుడు, ప్రజా నాయకుడు అని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీర్ల అయిలయ్య అన్నారు. బహుజనులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కుల, మత భేదాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.సర్దార్ సర్వాయి పాపన్న చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, సమానత్వ భావనలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయాల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టుపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- రైతుల ప్రయోజనాలకు తీవ్ర నష్టం
- సీతమ్మసాగర్ బ్యారేజీని వెంటనే పూర్తి చేయాలి..
- సీతారామకు నిధులు కేటాయించి సాగునీరు అందించాలి
- సీపీఎం రాష్ట్ర, ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకుల డిమాండ్



**మణుగూరు/అశ్వాపురం, మహా:** సీతారామ ప్రాజెక్టు, సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ తీవ్ర జాప్యం చేస్తోందని, దీనివల్ల రైతుల ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతోందని సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అవసరమైన నిధులు కేటాయించి సీతమ్మసాగర్ బ్యారేజీతో పాటు సీతారామ ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర, ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకత్వం మంగళవారం అశ్వాపురం మండలంలో పర్యటించింది. సీతమ్మసాగర్ బ్యారేజీ, సీతారామ ప్రాజెక్టు కాలువలు, పంప్‌హౌస్‌లతో పాటు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను నాయకులు పరిశీలించారు. పనుల పురోగతి, కాలువల పరిస్థితి, భూసేకరణ, నిర్వాసితుల సమస్యలను స్థానిక నాయకులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు కాలువలను ఫీల్డ్ చానల్స్, చెరువులతో అనుసంధానం చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ హామీలు అమలవుతున్న పరిస్థితి కనిపించడం లేదన్నారు. 2026 ఆగస్టు 15 నాటికి సాగునీరు అందిస్తామని ప్రభుత్వం చెప్పిందని, ఆ హామీ ఏమైందో రైతులకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఆర్భాటపు ప్రకటనలు చేయడం కాకుండా ప్రాజెక్టు పూర్తికి కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశముందని తెలిపారు. సుమారు రూ.2 వేల కోట్లు కేటాయిస్తే 53 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని, ప్రగళ్లపల్లి లిఫ్ట్ ద్వారా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. సీతమ్మసాగర్ బ్యారేజీ, ప్రధాన కాలువలు, అనుబంధ కాలువలు, ఫీల్డ్ చానళ్ల పనులను సమన్వయంతో పూర్తి చేయాలని కోరారు.

**నిర్వాసితులకు న్యాయం చేయాలి..**

సీతారామ ప్రాజెక్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకే కాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తలమానికమైన ప్రాజెక్టని నాయకులు పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం తమ భూములను త్యాగం చేస్తున్న ప్రజలను అభినందిస్తూ, వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కుమ్మరిగూడెం, అమ్మగారిపల్లి ప్రాంతాల ప్రజలు ఇప్పటికే పలుమార్లు భూములు కోల్పోయారని, అయినప్పటికీ నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మగారిపల్లిలో ఇంకా సుమారు 35 మంది నిర్వాసితులకు కోర్టు తీర్పు అనుకూలంగా ఉన్నప్పటికీ న్యాయం జరగాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి న్యాయమైన పరిహారం, పునరావాస ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు.

**నీళ్లు వస్తాయని నార్లు పోస్తే.. పంటలు ఎండుతున్నాయి**

సీతారామ ప్రాజెక్టు ద్వారా మణుగూరు మండలంలోనూ దాదాపు 20 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని నాయకులు తెలిపారు. తుమ్మల చెరువు పూర్తయినప్పటికీ దాని పరిధిలోని సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నీరు అందిస్తామని చెప్పడంతో రైతులు నార్లు పోశారని, ఇప్పుడు నీరు రాక పంటలు ఎండిపోతుంటే ఆ నష్టానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. పాల్వంచ రూరల్, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు తదితర మండలాల్లో భూముల సర్వేలు చేసినప్పటికీ రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో స్పష్టత లేదన్నారు. భూములు సేకరించే ముందు న్యాయమైన పరిహారం ఇస్తామని చెప్పి, అనంతరం రైతులను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రాజెక్టు పనులు, కాలువల నిర్మాణం, భూసేకరణ, నష్టపరిహారం తదితర అంశాలపై వస్తున్న అనుమానాలు, ఆరోపణలకు ప్రభుత్వం పారదర్శకంగా సమాధానం చెప్పాలని కోరారు. రాజీవ్‌సాగర్ కెనాల్‌కు నిధులు విడుదల చేసి పనులు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అదే ప్రాధాన్యతతో సీతమ్మసాగర్ బ్యారేజీ, సీతారామ ప్రాజెక్టు అనుబంధ కాలువల పనులను కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కాలువలను చెరువులు, ఫీల్డ్ చానళ్లతో అనుసంధానం చేసి రైతులకు వాస్తవంగా సాగునీరు అందించినప్పుడే ప్రాజెక్టు లక్ష్యం నెరవేరుతుందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే సీతారామ ప్రాజెక్టు సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, అన్నవరపు కనకయ్య, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై.విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్య, లిక్కి బాలరాజు, బండి పద్మ, ఎర్ర శ్రీనివాసరావు, మడిపల్లి గోపాలరావు, మెరుగు సత్యనారాయణ పాల్గొన్నారు. జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, గద్దల శ్రీనివాస్, సత్రపల్లి సాంబశివరావు, భూక్యా రమేష్, నిమ్మల వెంకన్న, మర్మం చంద్రయ్య, కొండబోయిన వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి పాయం నరసింహారావు, సీనియర్ నాయకులు సర్గం బాలనర్సయ్య, వాసిరెడ్డి వరప్రసాద్, కుమ్మరిగూడెం మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య, అశ్వాపురం మండల కమిటీ సభ్యులు అశోక్‌రెడ్డి, శంబిరెడ్డి, సాంబశివరావు, దండి రాములు, మోకాళ్ల రమేష్, పాయం విజయ, బొడ్డు రాములు, బొమ్మరాతి రామయ్య, మోహన్‌రెడ్డి, నరసింహాచారి, పాయం జానకమ్మ, మణుగూరు మండల కమిటీ సభ్యుడు కొడిశాల రాములు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ప్రాణాలతో... చెలగాటమా?

- ప్రజారోగ్యంపై శ్రద్ధ బట్టని అధికారులు?
- నామమాత్రపు తనిఖీలు ఇవి ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరు?
- పట్టించుకోవాలంటున్న ప్రజలు

**కుషాయిగూడ, మహ :** కుషాయిగూడలో ఆహార నాణ్యతపై వరసగా వెలుగులోకి వస్తున్న ఘటనలు ప్రజల్లో తీవ్ర ఆందోళన రేకెస్తున్నాయి. పెరుగులో కల్తీ... కోవా కల్తీ... పన్నీరు కల్తీ ...కల్తీ కల్తీ కల్తీ ఎక్కడ చూసినా నాసిరకం పదార్థాలు. ఇటీవల కుషాయిగూడ వాసవి శివనగర్ సమీపంలో నందిని మిల్క్ సెంటర్ లో 1200 కిలోల నాసిరకం పెరుగు, ఏడు కిలోల కల్తీ కోవాను ఎస్ఓటి పోలీసులు పట్టుకొని యజమాని చంద్రశేఖర్ ను అరెస్టు చేశారు గుట్టు చప్పుడు కాకుండా కల్తీ వ్యాపారాన్ని యదేచ్ఛగా కొనసాగిస్తున్న కుషాయిగూడ మురళీకృష్ణ మిల్క్ సెంటర్ లో కల్తీ పన్నీరు అమ్ముతున్నారని పలువురు జర్నలిస్టులు వీడియోలు తీయడంతో అసలు కథ బయటికి వచ్చింది కుషాయిగూడ పోలీసులు పన్నీరును ల్యాబ్ కు టెస్టింగ్ ల కోసం పంపించారు 650 రూపాయలు కిలో ఉండాల్సిన పన్నీరు తక్కువ ధరకే అమ్మడంపై నాసిరకమైన పన్నీరు అని అర్థమవుతుంది గత 15 రోజుల క్రితం నాగారంలో 1000 కిలోల కల్తీ పన్నీర్ ను పట్టుకున్న ఎస్వోటీ పోలీసులు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే తనయుడని పోలీసు విచారణలో తేలింది. నాసిరకమైన పెరుగు, పన్నీరు, కోవా తయారు చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వినియోగదారులు మొరపెట్టుకుంటున్నారు. కొన్నేళ్లుగా కల్తీ వ్యాపారం జరుగుతున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు చూసి చూడనట్లు వ్యవహరించడంతోనే రోజురోజుకు కల్తీ వ్యాపారం పెరిగిపోతుందంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాదు నగరంలో చుట్టూ శివారు ప్రాంతాలు కల్తీ వ్యాపారాలకు అడ్డాలుగా మారాయి. ఇకనైనా కల్తీ వ్యాపారాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని స్థానికులు కోరుకుంటున్నారు.







# మణుగూరు విద్యార్థుల ఆవిష్కరణలు భేష్..

- 3ఎలక్ట్రిక్ వాహనాలను కమర్షియల్‌గా తీర్చిదిద్దేందుకు సహకారం
- 119 ఏటీసీల విద్యార్థుల మధ్య ఇన్నోవేషన్ పోటీలు..
- ఉత్తమ ఆవిష్కరణలకు అవార్డులు.. ఉద్యోగ అవకాశాలు..
- 3టాటా ద్వారా 100 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు..
- గిరిజన ప్రాంత యువ రైతులకు త్వరలో ఆధునిక వ్యవసాయ కోర్సులు
- టామ్‌కామ్‌తో జర్మనీ, జపాన్‌లో ఉద్యోగాలకు శిక్షణ
- మణుగూరులో ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్..
- -రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి..

**మణుగూరు, మహా:** మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ప్రభుత్వ ఐటీఐ-అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులు, భూగర్భ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కొనియాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు రాష్ట్రంలోని 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల విద్యార్థుల మధ్య ఇన్నోవేషన్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. అత్యుత్తమ ఆవిష్కరణలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి అవార్డులతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం మణుగూరు ప్రభుత్వ ఐటీఐ-ఏటీసీ విద్యార్థుల నూతన ఆవిష్కరణల అభినందన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన వివిధ పరికరాలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.

**పాత విడిభాగాలతో ఎలక్ట్రిక్ వాహనాలు..**

విద్యార్థులు పార్థసారథి, స్ఫూర్తి పాత వాహనాల విడిభాగాలను పునర్వినియోగం చేస్తూ రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాటిని పరిశీలించిన మంత్రి.. తయారీ విధానం, ఉపయోగించిన సాంకేతికత, వాహనాల పనితీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుని అభినందించారు. ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన ఐటీఐ-ఏటీసీ విద్యార్థులు రూపొందించిన ఇతర నూతన పరికరాలను సైతం పరిశీలించారు. పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలు ఇతర ఏటీసీ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. వీటిని మరింత సాంకేతికంగా అభివృద్ధి చేసి కమర్షియల్ వెహికల్స్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల ఆవిష్కరణలు ప్రాజెక్టులకే పరిమితం కాకుండా మార్కెట్‌లో ఉపయోగపడే ఉత్పత్తులుగా మారేందుకు పరిశ్రమల సహకారం తీసుకుంటామని చెప్పారు.

**- టాటాతో రూ.4 వేల కోట్లతో ఏటీసీల అభివృద్ధి..**

రాష్ట్రవ్యాప్తంగా 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను టాటా సంస్థ సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఇందుకు టాటా సంస్థ సుమారు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో సహకరిస్తోందన్నారు. సంప్రదాయ ఐటీఐ కోర్సులతో పాటు పరిశ్రమల ప్రస్తుత అవసరాలకు అనుగుణమైన ఆధునిక సాంకేతిక కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. మణుగూరు ఏటీసీలో విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తే 100 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టాటా సంస్థ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. శిక్షణ పూర్తయిన వెంటనే యువత ఉపాధి పొందేలా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**జర్మనీ, జపాన్‌లో ఉద్యోగాలకు టామ్‌కామ్ బాట**

తెలంగాణ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్ ద్వారా చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. జర్మన్, జపనీస్ తదితర విదేశీ భాషల్లో శిక్షణ ఇచ్చి జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగాలు పొందేలా యువతను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం టామ్‌కామ్‌కు రూ.90 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. చెన్నూరులో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఐటీఐ ఉత్తీర్ణులైన సుమారు 100 మంది యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. వారు ఇప్పటికే ఏ1, ఏ2 స్థాయిలు పూర్తి చేశారని, బి1, బి2 స్థాయిలు పూర్తి చేస్తే విదేశీ ఉద్యోగాలకు అవకాశాలు మెరుగవుతాయన్నారు. మణుగూరులోనూ ఇదే తరహా శిక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**మణుగూరుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్**

మణుగూరు ప్రాంతంలో ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. సుమారు 100 మంది యువతకు శిక్షణ ఇచ్చి పరిశ్రమలతో అనుసంధానం చేసి ఉద్యోగాలు కల్పించే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించిందని, ఇప్పటివరకు ఉపాధ్యాయులు, నర్సులు, సింగరేణి తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో కలిపి సుమారు లక్ష ఉద్యోగాలు కల్పించినట్లు మంత్రి పేర్కొన్నారు. రాబోయే రెండున్నరేళ్లలో మరో లక్ష ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**విదేశీ భాషలతో అవకాశాలు: ఎంపీ బలరాం నాయక్**

మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతమైన మణుగూరులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏటీసీ ఏర్పాటు కావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. జపనీస్ వంటి విదేశీ భాషలను నేర్చుకుంటే విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. గిరిజన, పేద, కార్మిక కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వారి భవిష్యత్తును మార్చవచ్చన్నారు.

**ఏటీసీకి రెసిడెన్షియల్ హాస్టల్ కావాలి: ఎమ్మెల్యే పాయం**

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియోజకవర్గం ప్రధానంగా గిరిజన, ఏజెన్సీ ప్రాంతమని, గిరిజనులు, దళితులు, బీసీలు, పేద, బలహీన వర్గాల విద్యార్థులు అధికంగా ఉన్నారని తెలిపారు. మణుగూరులో సింగరేణి, బీటీపీఎస్, అశ్వాపురంలో భారజల కర్మాగారం, బూర్గంపాడులో ఐటీసీ పేపర్‌బోర్డు, పాల్వంచలో నవభారత్, కేటీపీఎస్ వంటి పరిశ్రమలు ఉన్నందున వాటి అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు శిక్షణ ఇస్తే విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మణుగూరు ఏటీసీలో 244 మంది, ఐటీఐలో 168 మంది కలిపి 412 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఏటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న 50 మందికి ఈ సందర్భంగా అభినందన పత్రాలు అందజేశారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల కోసం ఐటీఐ-ఏటీసీ వద్ద రెసిడెన్షియల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామిని ఎమ్మెల్యే కోరారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు.

**ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తాం: కలెక్టర్ అంకిత్**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మణుగూరు ప్రాంతం సుమారు 80 శాతం ఏజెన్సీ, షెడ్యూల్డ్ ఏరియా పరిధిలో ఉందన్నారు. మరోవైపు సింగరేణి, నవభారత్, ఐటీసీ తదితర పరిశ్రమలు ఉండటంతో వాటి అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులతో పాటు రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సీఎన్‌సీ వంటి ఆధునిక కోర్సులకు డిమాండ్ ఉందన్నారు. ఐటీఐ, ఏటీసీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశ్రమల అవసరాలతో అనుసంధానించేందుకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్స్ జాయింట్ డైరెక్టర్ నగేష్, టామ్‌కామ్ ఈవో గౌస్ పాషా, రతన్ టాటా ఆర్డీడీ కోటేశ్వరరావు, ఏటీసీ కళాశాల ప్రిన్సిపాల్ సారంగపాణి, తహసీల్దార్ అద్దంకి నరేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ పరిశీలన

**క్యాతనపల్లి మహా :** క్యాతనపల్లి మున్సిపాలిటీలో మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ముందుగా 9వ వార్డులో నిర్మాణంలో ఉన్న స్మశాన వాటిక పనులను పరిశీలించి, ఆర్కే1 గని సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న స్మశాన వాటిక పనులను కూడా పర్యవేక్షించారు. పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం 17వ, 20వ వార్డుల్లో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి నాణ్యతా లోపాలకు తావివ్వకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారుడిని ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ గొడిసెల సంధ్యారాణి, కౌన్సిలర్ కూతురు ప్రభాకర్‌తో పాటు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# రైస్ మిల్లర్ల బకాయిలు త్వరగ చెల్లించాలి

- **మంచిర్యాలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

**మంచిర్యాల, మహా :** జిల్లాలోని రైస్ రైస్ మిల్లర్ల బకాయిలు త్వరగ చెల్లించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో బి సెక్షన్ పర్యవేక్షకులు మధుసూదన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి సంబంధిత మండలాల తహసిల్దార్లు, జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం వసూలు చేసే అంశంపై సమావేశం నిర్వహించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్‌లోని నిబంధనలు, బకాయిల వసూళ్లకు అనుసరించవలసిన విధివిధానాలు, మిల్లుల వారీగా పెండింగ్‌లో ఉన్న బకాయిల మొత్తాలపై రికన్సిలియేషన్, కోర్టు కేసులకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి రావలసిన బకాయిలను పూర్తిస్థాయిలో గుర్తించి, సంబంధిత రికార్డులను సరి చూసి, నిబంధనల ప్రకారం వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కోర్టు కేసుల విషయంలో తీసుకోవలసిన చర్యలు, పెండింగ్ అంశాలను నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రోడ్లపై పశువులు వదిలితే చర్యలు

**క్యాతనపల్లిమహా :** రోడ్లపై పశువులను వదిలే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చైర్మన్ గొడిసెల సంధ్యారాణి, ఎస్సై శ్రీధర్ హెచ్చరించారు. మంగళవారం అమ్మ గార్డెన్ సమీపంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పశువుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నందున యజమానులు వాటిని ఇళ్లలోనే ఉంచాలని సూచించారు. రోడ్లపై వ్యాపారాలు నిర్వహించే వారు పార్కింగ్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కూతురు ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలి

- **విడుదల చేయకపోతే ప్రభుత్వంపై జంజీ ఉద్యమం తప్పదు....**
- **ఎస్ఎఫ్ఐరంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్..**




**రాజేంద్రనగర్ మహా;** పెండింగ్‌లో ఉన్న 10,814 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను తక్షణమే విడుదల చేయాలంటూ జిహెచ్ఎంసి శంషాబాద్ పరిధిలో మంగళవారం ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కే ప్రణయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. ఫీజు రియంబర్స్మెంట్ నిధుల విడుదల చేయకపోతే ప్రభుత్వంపై జంజీ లాంటి ఉద్యమం తప్పదు అన్నారు.. ప్రభుత్వం నిధులు విడుదల చెయ్యకపోవడంతో ఆ భారాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై మోపడం అన్యాయమన్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి బలవంతంగా వసూలు చేయడం సరికాదన్నారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీ మెమోలు, ఇతర విద్యా ధ్రువపత్రాలను కళాశాలలో ఉంచుకుని విద్యార్థులను, తల్లిదండ్రులను వేధిస్తున్న ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి షరతులు లేకుండా అందించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేసే విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను వేంటనే విడుదల చేయాలన్నారు. లేకపోతే జంజి లాంటి ఉద్యమం తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వద్ద శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ నాయకులు తనిష్క్, అభినవ్, రుద్రాక్ష, సాయి హర్ష, నిహారిక, రామ్ చరణ్, తరుణ్, రాజేష్ విష్ణువర్ధన్, విధార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.210 కోట్ల మిషన్ భగీరథ పనుల పరిశీలన

- **మిషన్ భగీరథ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**యాదాద్రి భువనగిరి / మేడ్చల్ మల్కాజిగిరి ఆగస్టు 18 మహా :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం ఘన్‌పూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో జరుగుతున్న రూ.210 కోట్ల మిషన్ భగీరథ ప్రాజెక్టు పనులను మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘన్‌పూర్ ట్యాపింగ్ ప్రాంతంలో జరుగుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రజలకు త్వరితగతిన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సూచించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు, భువనగిరి, మేడ్చల్ నియోజకవర్గాల పరిధిలోని 574 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.210 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. యాదగిరిగుట్టలో ఈ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించామని, ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పైప్‌లైన్ పనుల్లో కొంత భాగం అటవీ ప్రాంతంలో ఉన్నందున అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులను ఫేజ్-1, ఫేజ్-2లో పొందుతూ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. మిగిలిన గ్యాప్ పనులను కూడా త్వరగా పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అక్టోబర్ 2026 నాటికి గ్యాప్ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఘన్‌పూర్ ట్యాపింగ్ వద్ద హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ నుంచి రోజుకు 80 ఎంఎల్‌డీ నీటి సరఫరాను అనుసంధానం చేయడంతో పాటు, సుమారు 100 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీటిని అదనంగా సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. గత పాలనలో తాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యంప్రజా ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీర్ల అయిలయ్య గారు అన్నారు. గత పదేళ్ల పాలనలో తెలంగాణలో సాగునీరు, తాగునీటి ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని భారీగా దుర్వినియోగం చేశారని ఆయన విమర్శించారు. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టుల పేరుతో, మిషన్ భగీరథ పేరుతో కోట్లాది రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. అప్పటి పాలకులు ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడేలా పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టలేదని, భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని బీర్ల అయిలయ్య తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మిషన్ భగీరథ పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.. ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించుకుని, అటవీ ప్రాంతాల్లో అవసరమైన అనుమతులు సాధిస్తూ పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.. అటవీ ప్రాంతాల్లో అనుమతుల సమస్యల కారణంగా నిలిచిపోయిన పనులకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ అనుమతులు పొందుతున్నామని చెప్పారు. పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే ఆయా గ్రామాలు, ఆవాసాలు, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేకుండా అవసరమైన ప్రాంతాల్లో మిషన్ భగీరథ పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలకు భిన్నంగా ప్రజా ప్రభుత్వంలో ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే వినియోగించేలా పారదర్శక పాలన సాగిస్తున్నామని తెలిపారు. సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే మూడు నియోజకవర్గాల పరిధిలోని వందలాది గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని బీర్ల అయిలయ్య గారు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఇంజనీర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాలకు పథకాల ఫలాలు చేరాలి

- **పినపాకలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి**
- **మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **దిశా సమావేశంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు, మహా :** మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. పినపాక నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంగళవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని పినపాక నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ప్రస్తావించారు.




**మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలి**

పినపాక నియోజకవర్గంలో అధిక భాగం గిరిజన, మారుమూల ప్రాంతాలు ఉన్నందున అక్కడి ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, ఉపాధి అవకాశాలు, గృహ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి శాఖల మధ్య సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు.

**పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి..**

నిధులు మంజూరైనప్పటికీ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పాయం వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. పనులు ఆలస్యమైతే ప్రజలకు వాటి ప్రయోజనం సకాలంలో అందదని, అందువల్ల నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల వేగంతో పాటు నాణ్యత విషయంలోనూ రాజీపడకూడదని పేర్కొన్నారు. గిరిజన, వెనుకబడిన గ్రామాల అభివృద్ధికి అందుబాటులో ఉన్న కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దిశా సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, లక్ష్యాల సాధన, పెండింగ్ పనులతో పాటు రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి, గృహ నిర్మాణం తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. సమావేశంలో ఎంపీలు రామ సహాయం రఘురామ్‌రెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, కొత్తగూడెం మేయర్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అడుగు జాడల్లో పయనిద్దాం

- **బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పాపన్న గౌడ్**
- **జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య కు**

**షాయిగూడ, మహా :** బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య పేర్కొన్నారు. భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాడి బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన ధీరుడని కావ్య కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని జవహర్ నగర్ లోని అంబేద్కర్ నగర్ లో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేకల కావ్య మాట్లాడుతూ పాపన్న గౌడ్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని అన్ని వర్గాలు ప్రజలు ఒకటేనంటూ ఆనాడే చాటి చెప్పారని గుర్తు చేశారు. మహనీయుల ఉత్సవ కమిటీ ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిట్టా శ్రీనివాస్ రెడ్డి, కొండల్, సంగీత రాజశేఖర్, రవి, వెంకటేష్ గౌడ్, సింగం బాలరాజు పటేల్, పంతంగి సిద్ధులు యాదవ్, ప్రసాద్ గౌడ్, మహేష్, సోమయ్య గౌడ్, సాయి, దిలీప్, అశోక్, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## ఉచిత నీట్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- **చిలుకూరు ఫౌండేషన్ సీవోఈలో 100 మందికి అవకాశం..**

**మొయినాబాద్ మహా:** 2026-27 విద్యా సంవత్సరానికి నీట్ 2027 పరీక్ష కోసం ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్ అందించనున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని టీజీఎస్ డబ్ల్యూఆర్ ఫౌండేషన్ సీవోఈ, చిలుకూరులో బాలురకు ఈ శిక్షణ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. 2025 -26 విద్యా సంవత్సరంలో గురుకుల పాఠశాల, కళాశాలలో బీపీసీ ఇంటర్ ఉత్తీర్ణులై, నీట్ 2026 పరీక్ష రాసిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల విద్యార్థులు అర్హులని తెలిపారు. మొత్తం 100 మందికి ఉచిత వసతి, భోజనం, శిక్షణ కల్పించనున్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, దాని ప్రతితో అవసరమైన ధ్రువపత్రాలను సంబంధిత జిల్లా టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ కోఆర్డినేటర్ కార్యాలయంలో లేదా చిలుకూరు ఫౌండేషన్ సీవోఈలో అందజేయాలని సూచించారు. దరఖాస్తుకు ఎలాంటి ఫీజు లేదు. చివరి తేదీ ఆగస్టు 22, 2026 మరిన్ని వివరాలకు "టీజీఎస్ డబ్ల్యూ ఆర్ఈఐఎస్" అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఫౌండేషన్ సీవోఈ చిలుకూరు ప్రిన్సిపాల్ శౌరిరాజు తెలిపారు.

## పెద్ది విగ్రహాన్ని కూల్చివేయడం ఉద్యమాన్ని అవమానించడమే

**బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ఇంచార్జ్ సయ్యద్ మసూద్**

**వరంగల్, మహా ;** వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ఇంచార్జ్ సయ్యద్ మసూద్, అలాగే 29 వ డివిజన్ అధ్యక్షుడు కే సదాంత్ లను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేసి మట్టేవాడ పోలీస్ స్టేషన్ కు తరలించారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని నర్సంపేట లో పోలీసుల సమక్షంలో అధికార కాంగ్రేస్ పార్టీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక అధికారులు రాత్రికి రాత్రే విగ్రహాన్ని కూల్చివేసిన ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన పై బిఆర్ఎస్ నాయకులతో కలిసి నర్సంపేట కు వెళ్తామనే భయంతో అధికార పార్టీ బియర్ శ్రేణు లను అక్రమంగా అరెస్ట్ చేయడం జరిగింది. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేతను తీవంగా ఖండించిన వర్ధన్నపేట్ నియోజవర్గ సభ్యత్వం ఇంచార్జ్ సయ్యద్ మసూద్ పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేయడం అంటే యావత్ తెలంగాణ ఉద్యమానికి అవమానించడమే అని మండిపడ్డారు.



## విద్యతో పాటు నైపుణ్యాల

# అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలి

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
- **కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించాలి**
- **విద్యాలయ అబివృద్ధి పనులకు ప్రతిపాధనలు పంపాలి**
- **ఏకలవ్య మోడల్ స్కూల్ ను అకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్**



**కారేపల్లి, మహా:** విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలు అందుకునేలా అవసరమైన నైపుణ్యాలను పెంపొందించటానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ సూచించారు. మంగళవారం సింగరేణి మండలం రేలకాయలపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల ప్రవేశాలు, విద్యా ఫలితాలు, వారికి అందుతున్న భోజనం, వసతులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి బోధనా తీరును పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ఆసక్తి, భవిష్యత్ లక్ష్యాలు, ఉన్నత విద్యలో ఎంచుకునే కోర్సులగురించి చర్చించారు. లైబ్రరీ, మ్యూజిక్ రూమ్, ఆర్ట్స్ గ్యాలరీ, సైన్స్ ల్యాబ్ లను కలెక్టర్ పరిశీలించారు. సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలను తిలకించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. పోటీ ప్రపంచంలో కేవలం విద్యార్హతలే కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు వంటి నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు.

**విద్యాలయ అబివృద్ధి పనులకు ప్రతిపాధనలు పంపాలి**

ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యాలయ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ఖమ్మం- చీమలపాడు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పాఠశాల భవనం ప్రహరీ గోడపై సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేయాలని, పాఠశాల ప్రాంగణంలో అదనపు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, విద్యా సామగ్రి, ప్రయోగశాలలు, లైబ్రరీ, క్రీడా సదుపాయాలు, విద్యుత్, తాగునీరు తదితర వసతులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, నాణ్యమైన ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సుమారు 9.57 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుండగా, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్, తన్నీరు నాగేశ్వరరావు, ఆర్ఐ జగదీశ్, గ్రామ సర్పంచ్ తేజావత్ శిరీష, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







# కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

**ఆదిలాబాద్ మహా :** ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ ఏర్పాటు చేసినట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. పట్టణం లోని తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవా భవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు ఆయన హాజరయ్యారు. నియోజకవర్గం లోని ప్రజలు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యల పై కంది శ్రీనివాస రెడ్డి కి వినతి పత్రాలు అందించారు. సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ప్రజాదర్బార్ ద్వారా అనేక సమస్యలు పరిష్కారమయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు శాంతన్ రావు, భూపెల్లి శ్రీధర్ ,గడ్డం జగదీష్ రెడ్డి,బిక్కి గంగాధర్, సుధాకర్ గౌడ్ , అన్నపూర్ణ, చరణ్ గౌడ్, దేవిదాస్, రాములు యాదవ్, బండారి సతీష్ , మంగేష్ ,అల్చెట్టి నాగన్న, భోజా రెడ్డి, మహబూబ్ , శ్రీలేఖ,దేశెట్టి ప్రవతి, సోనియా మంథని, జుబేదా, రమ, రఫీఖ్, సంటెన్న,చిత్రు, మునిగెల విఠల్, అశోక్, షాహిద్ అలీ,మహిపాల్ రెడ్డి,బొక్రె శంకర్, నితిన్, అచ్చుత్, పొచ్చిరాం, జనగ రామన్న, అడ్డి వెంకట్ రెడ్డి, కమలం బాయి, గంటూ బాయి, ఆత్రం నగేష్, పెందూర్ ఇస్తారి, గేడం గులాబ్ ,వినోద్ రెడ్డి,స్వామి ,జఫార్, ప్రభాకర్, వామన్, రవీందర్ రెడ్డి, ఆశన్న, సేనీల్ , గంగన్న తదితరులు పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం భారత ప్రజలకు స్ఫూర్తిదాయకం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం భారత ప్రజలకు స్ఫూర్తిదాయకమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే లతో కలిసి హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా కష్టపడి పనిచేసి చిన్న చిన్న లక్ష్యాలను సాధిస్తూ పెద్ద లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. మనమంతా ఐక్యంగా ఉన్నంతకాలం అభివృద్ధి వైపు ముందుకు సాగగలుగుతామని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ద్వారా ఆత్మవిశ్వాసం, సమష్టి కృషి ఉంటే మంచి ఫలితాలను సాధించవచ్చనే సందేశం తెలుస్తుందని, పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. మహానుభావుల ఆశయాలు, ఆచరణాత్మక పద్ధతులు భావితరాలకు తెలిసే విధంగా మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వెనుకబడిన తరగతులు, గౌడ సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి లో సైతం వేడుకలు**
**మందమర్రి మండల కేంద్రంలో**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మడిపల్లి వెంకటేష్ గౌడ్ లు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మొగల్ రాజుల ఆధిపత్యానికి, స్థానిక భూసాన్య శక్తులకు వ్యతిరేకంగా పోరాడిన ప్రముఖ యోధుడు పాపన్న అని అన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై స్వర్గీయ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్థూపాన్ని ఏర్పాటు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నోముల శ్రీనివాస్ గౌడ్, సొల్ల వెంకా గౌడ్, గంగాధర్ గౌడ్, కిష్టా గౌడ్, రవీందర్ గౌడ్, బండి శంకర్ గౌడ్, ఉష గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాయల్ శంకర్ కు డబ్బు పిచ్చి పట్టింది

- భూకబ్జాలకు పాల్పడుతున్నాడు
- ఆదిలాబాద్ నుండి తరిమికొట్టే రోజులు దగ్గర పడుతున్నయి
- పాయల్ ను వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ దక్కకుండా చిత్తుగా ఓడిస్తాం
- కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం
- అంతా కలిసి పార్టీ గెలుపు కోసం కృషి చేస్తాం..
- చేరికల కార్యక్రమంలో కంది శ్రీనివాస రెడ్డి ఎమ్మెల్యే పై ధ్వజం



**ఆదిలాబాద్ మహా :** స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ కు డబ్బు పిచ్చి పట్టిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి విమర్శించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.కాంగ్రెస్ నాయకులు భీమనవేణి రాములు యాదవ్, రవీందర్ యాదవ్ , పొచ్చారెడ్డి, వినోద్ రెడ్డి, స్వామి ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామం నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీ లోకి స్వాగతించారు. సోమవారం కూడా పట్టణంలోని 13వ వార్డునుండి ఇండిపెండెంట్ గా పోటీ చేసిన మసూద్ తో పాటు మహమూద్ సమీర్ పార్టీలో చేరారు. ధనదాహంతోనే పాయల్ శంకర్ భూకబ్జాలకు పాల్పడుతున్నారని కంది శ్రీనివాస రెడ్డి విమర్శించారు. ఇటీవలే తన భార్య పేరుపై కోట్ల రూపాయల విలువ చేసే 11 ప్లాట్లను బహుమతిగా ఇచ్చారన్నారు. ఎవ డబ్బసొమ్మని గిఫ్టుగా ఇచ్చారని ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తలకిందులుగా తపస్సు చేసినా ఆయన గెలవరని డిపాజిల్ కూడా దక్కకండా చిత్తుచిత్తుగా ఓడించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.ఆదిలాబాద్ గడ్డపైనుండి ఆయనను తరిమి కొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లను తాము ఇస్తున్నట్టుగా ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. మోస పూరిత వాగ్ధానాలతో ఆదిలాబాద్ ప్రజలను బీజేపీ వంచించిందన్నారు.ఎంపీ ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపిస్తే ఆదిలాబాద్ కు ఏంచేసారని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీలో ప్రభుత్వానికి క్రెడిట్ దక్కుండా తామే ఇస్తున్నట్టుగా ప్రజలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు.పని చేసే ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. సీసీఐ పునరుద్ధరణలో ఎమ్మెల్యే చేతకానితనంతో పూర్తిగా ఫెయిల్ అయ్యారని విమర్శించారు. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ భూసేకరణలో ఎవరికీ అన్యాయం జరగదన్నారు. ప్రభుత్వం ఇందుకోసం భారీగా నిధులు కేటాయించిందన్నారు. కేంద్రం తన వాటా నిధులను వెంటనే విడుదల చేసి ఎయిర్ పోర్ట్ పనులు వేగవంతం అయ్యేలా కేంద్రం పై ఒత్తిడి తేవాలన్నారు. పార్టీ బలోపేతమే తన లక్ష్యమన్నారు.అంతా కలిసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.ఇందిరమ్మ ఇండ్లు అన్ని గ్రామాలకు అందించామన్నారు. నేటితరం యువత ఆదిలాబాద్ గడ్డ పౌరుషాన్ని చూపించాలని పని చేసే తమ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు.అంతా అన్నదమ్ములల్లా కలిసి పనిచేద్దామన్నారు. ఎన్ని సమస్యలున్నా కూర్చుని పరిష్కరించుకుందామన్నారు.వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా అంతా కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు.మీ ఆశీర్వాదమే తనకు తన కుటుంబానికి ఎందో బలమన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు శాంతన్ రావు, భూపెల్లి శ్రీధర్ ,గడ్డం జగదీష్ రెడ్డి,బిక్కి గంగాధర్, సుధాకర్ గౌడ్ , అన్నపూర్ణ, చరణ్ గౌడ్, దేవిదాస్, రాములు యాదవ్, బండారి సతీష్ , మంగేష్ ,అల్చెట్టి నాగన్న, భోజారెడ్డి, మహబూబ్ , శ్రీలేఖ, దేశెట్టి ప్రవతి, సోనియా మంథని, జుబేదా, రమ, రఫీఖ్, సంటెన్న,చిత్రు, మునిగెల విఠల్, అశోక్, షాహిద్ అలీ,మహిపాల్ రెడ్డి,బొక్రె శంకర్, నితిన్, అచ్చుత్, పొచ్చిరాం, జనగ రామన్న, అడ్డి వెంకట్ రెడ్డి, కమలం బాయి, గంటూ బాయి, ఆత్రం నగేష్, పెందూర్ ఇస్తారి,గేడం గులాబ్ ,వినోద్ రెడ్డి,స్వామి ,జఫార్, ప్రభాకర్, వామన్, రవీందర్ రెడ్డి, ఆశన్న, సేనీల్ , గంగన్న తదితరులు పాల్గొన్నారు.









# రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలి : కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ మహా :**ఇటీవలి భారీ వర్షాలు కురిసినందున దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం బాసర మండలం బిద్రెల్లి సమీపంలో ఇటీవలి భారీ వర్షాలకు దెబ్బతిన్న అంతర్రాష్ట్ర రహదారిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమేరకు రోడ్లు దెబ్బతిన్నాయో అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రహదారులు ఉండాలన్నారు. అవసరమైన సూచికల బోర్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఈఈ ఆర్ అండ్ బి సుభాష్, తహసిల్దార్ పవన చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

- నివాళ్ళు అర్పించిన మున్సిపల్ చైర్ పర్సన్, అడిషనల్ కలెక్టర్
- బీసీ సంఘాల నాయకులు

**ఆదిలాబాద్ మహా:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామ్రాజ్యవాదం, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, సామాన్య ప్రజలకు అండగా నిలిచిన గొప్ప యోధుడని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు..మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల పాపన్న గౌడ్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆమె హాజరయ్యారు.అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి పాపన్న గౌడ్ విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సామాజిక సమానత్వం, స్వాభిమానం, ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరాలకు కూడా స్ఫూర్తిదాయకమన్నారు. అణగారిన వర్గాల ప్రజలకు గౌరవం, హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో పాపన్న గౌడ్ ముందుకు సాగారని తెలిపారు. ఆయన జీవిత పోరాటం కేవలం ఒక వర్గానికి సంబంధించినది కాదని సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వం కోసం జరిగిన గొప్ప పోరాటమన్నారు. సఆయన చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రజాసేవ స్ఫూర్తిని మనం ముందుకు తీసుకెళ్లాలలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్ , బీసీ సంఘ అధ్యక్షుడు చిక్కాల దత్తు, ఇతర బీసీ సంఘాల నాయకులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డిని కలిసిన పద్మశాలి సంఘు నాయకులు

**ఆదిలాబాద్ మహా:** ఇటీవలే ఎన్నికైన జిల్లా ,తాలూకా పద్మశాలి సంఘ నూతన కార్యవర్గ బాధ్యులు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన నేతలకు కంది శ్రీనివాస రెడ్డి సాదర స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షకార్యదర్శులు జక్కుల సత్యనారాయణ, కుర్ర రవీందర్, తాలుకా అధ్యక్ష కార్యదర్శులు అనుముల ఉషన్న, కొక్కుల అడెల్లు లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సంఘ అభివృద్ధి కోసం సహకరించాలన్న వారి విజ్ఞప్తికి కంది శ్రీనివాస రెడ్డి సానుకూలంగా స్పందించారు.





# హెచ్ఐవి ఎయిడ్స్ పై జిల్లాలో బైక్ ర్యాలీ

- ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి
- మన్సురాబాద్ నుండి ఎల్బీనగర్ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ

**ఎల్బీనగర్ ఆగస్టు 18 మహా:** హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించేందుకు, మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్ లో భాగంగా మన్సురాబాద్ నుండి ఎల్బీనగర్ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన, రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి ప్రారంభించిన ఈ యొక్క బైక్ ర్యాలీలో, అదనపు డిఎంహెచ్ఓ డాక్టర్ పాప రావు, డిటిఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది, యువత, ఆశ కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, నాకో ప్రతినిధులు తదితరులు ర్యాలీలో పాల్గొని హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు.బైక్ ర్యాలీలో హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ, సురక్షిత జీవన విధానం, పరీక్షలు, చికిత్స, వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం వంటి అంశాలపై నినాదాలు చేస్తూ, బైక్‌లపై అవగాహన పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శిస్తూ మన్సురాబాద్ నుండి ఎల్బీనగర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగించారు.ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ... హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి పట్ల ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. హెచ్ఐవితో జీవిస్తున్న వారిని వివక్షకు గురి చేయకుండా వారికి గౌరవం, అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ కు సంబంధించిన సందేహాలు, సలహాల కోసం 1097 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ఏసిఎస్ ఐసిటిసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సెంటర్స్ సిబ్బంది, జిల్లా ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్ఎసిఓ ప్రతినిధులు, ఆశ కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు తెలంగాణ అమరవీరుల స్థూపానికి భూమి పూజ

**ఆలేరు ఆగస్టు 18 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ఈనెల 19న రైల్వే గేట్ అమరవీరుల చౌరస్తాలో అమరవీరుల స్తూపం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్తూపం నిర్మాణ కమిటీ నాయకులు తెలిపారు ఈ కార్యక్రమానికి ఆలేరు ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య . భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్, మాజీ మంత్రి, మాజీ శాసనసభ్యులు మోత్కు పల్లి నరసింహులు . మాజీ శాసనసభ్యులు డాక్టర్ నగేష్ . మాజీ శాసనసభ్యులు, సునీత మహేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య, కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి . PACS చైర్మన్ జనగాం ఉపేందర్ రెడ్డి . బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రారెడ్డి, .సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్ .సిపిఐ జిల్లా కార్యదర్శి యానాలా దామోదర్ రెడ్డి .తెలంగాణ ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజని బాలమణి భాస్కర్, స్థానిక కౌన్సిలర్స్. మాజీ మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్స్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు ఉద్యమకారులందరూ హాజరు కానున్నారు.




# అనుమతులు లేకుండా కమర్షియల్ ఫ్లెక్సీలు ముద్రిస్తే కఠిన చర్యలు

- ఫ్లెక్సీ తయారీదారులకు బల్దియా కమిషనర్ వెంకన్న హెచ్చరిక
- ఫ్లెక్సీలు ఏర్పాటుకు బల్దియా ర అనుమతుతి తప్పనిసరి

**వరంగల్, కార్పొరేషన్ మహా;**గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో బల్దియా అనుమతులు లేకుండా కమర్షియల్ ఫ్లెక్సీలను ముద్రించినా, అనధికారికంగా ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న హెచ్చరించారు.మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో నగర పరిధిలోని ఫ్లెక్సీ తయారీదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సుందరీకరణకు విఘాతం కలగకుండా ఫ్లెక్సీల ముద్రణ, ఏర్పాటు విషయంలో పాటించాల్సిన నిబంధనల పై వారికి కమిషనర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కమర్షియల్ సంస్థలకు సంబంధించిన ఫ్లెక్సీలను ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ భవనాలు, జంక్షన్లు, మీడియన్లు, డివైడర్ల మధ్య ఉన్న టెలిఫోన్, విద్యుత్ స్తంభాలు, చెట్ల పై ఏర్పాటు చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించ బోమని స్పష్టం చేశారు. నిబంధనలకు సంబంధించిన సర్క్యులర్ కాపీలను ఫ్లెక్సీ తయారీదారులకు అందజేసి, వాటికి అనుగుణంగానే ఫ్లెక్సీలను ముద్రించాలని ఆదేశిస్తామన్నారు. కమర్షియల్ సంస్థల యాజమాన్యాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలనుకుంటే బల్దియా సూచించిన ప్రాంతాల్లో ముందస్తు అనుమతులు పొందిన అనంతరం వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగరంలోని ఫ్లెక్సీ తయారీదారులందరితో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు నిబంధనలు, ఆదేశాలను వారికి చేరవేస్తామని తెలిపారు.నగర సుందరీకరణను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు.కమర్షియల్ సంస్థలు, ఫ్లెక్సీ యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే మునిసిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.అనధికారిక ఫ్లెక్సీల నియంత్రణ, నగర సుందరీకరణకు సంబంధించి త్వరలో నగర పోలీస్ కమిషనర్‌తో సమావేశం నిర్వహించి, పోలీస్ శాఖ సహకారం కూడా కోరనున్నట్లు కమిషనర్ తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బల్దియాకు సహకరించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి శంకర్ లింగం, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజేశ్వర్ రావు, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చాలీచాలని బతుకులు... వీధి వ్యాపారుల జీవన మెతుకులు

- కుటుంబ పోషణ... కోసం రోడ్లు వీధుల వెంట వ్యాపారం
- రేక్కాడితే గాని డొక్కాడని బతుకులు
- సహాయ పడాలంటున్న.. జవహర్ నగర్ వీధి వ్యాపారులు



**కుషాయిగూడ, మహా :** చాలీ చాలని బతుకులు కుటుంబ పోషణ కోసం రోడ్లు వీధుల వెంట వ్యాపారుల చేసే వీధి వ్యాపారుల దుస్థితి. కాలం మారినా ప్రపంచం టెక్నాలజీ వైపు దూసుకెళ్తున్నా హైదరాబాద్ హైటెక్ యుగం వైపు పరిగెత్తుతున్న జవహర్ నగర్ లోని వీధి వ్యాపారుల పరిస్థితి గుంతలో పడ్డ బొంతలా తయారైంది. పొట్టకూటి కోసం రోజంతా కష్టించే వారి బతుకులు బాగు చేసేందుకు ఏ ఒక్కరూ ముందుకు వచ్చి మేమున్నామంటూ భరోసా ఇవ్వలేని పరిస్థితి. జవహర్ నగర్ లో సుమారుగా 100కు పైగా కాలనీలో విస్తరించి మెగా కార్పొరేషన్ గా ఏర్పడ్డాక ప్రజల అవసరాల కోసం వీధి వ్యాపారాలు ఎక్కువగా రోడ్ల వెంబడి కాలనీల వెంబడి నిత్యం జరుగుతుండగా వీధి వ్యాపారుల బ్రతుకులు మాత్రం అగమ్య గోచరంగా తయారయ్యాయి. వీధి వ్యాపారులు సరసమైన ధరలకు వస్తువులను అందించడం ద్వారా జవహర్ నగర్ పట్టణంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. అయినప్పటికీ వారి జీవితాలు ఆర్థిక అభద్రత అస్థిరమైన పరిస్థితులు ఆరోగ్య పరిస్థితులు ప్రమాదాలు సామాజిక వివక్ష తదితర సామాజిక రుగ్మతలతో బాధపడుతున్నారు.డైలీ ఫైనాన్స్ కష్టాలు మూలిగే నక్క మీద తాటి పండు పడ్డచందంగా అసలే ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న వారికి డైలీ ఫైనాన్స్ రుణ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. వీధి వ్యాపారస్థులంటే నైపుణ్యం లేని వారుగా లేదా చదువు లేని వారుగా ముద్ర పడినందువల్ల వీరు సమాజంలో ఎక్కువగా వివక్షతకు గురవుతున్నారు.జవహర్ నగర్ వీధులు ప్రధాన రోడ్ల వెంబడి చిరు వ్యాపారం నిర్వహించేది ఎక్కువగా మహిళలే కావడం గమనార్హం. కూరగాయల నుండి మొదలుకొని పువ్వులు, పండ్లు, రెడీమేడ్ గాజులు, ఫ్యాన్సీ వస్తువులు తదితరాలన్నీ ఎక్కువగా విక్రయించేది మహిళలే. వీరు తమ వస్తువులను విక్రయిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

దుర్భర జీవితంజవహర్ నగర్ పట్టణ వీధుల్లో వీధి వ్యాపారుల ఆర్థిక పరిస్థితి దుర్భరంగా మారింది అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సామాగ్రిని విక్రయిస్తుండగా సరైన అమ్మకాలు లేక నష్టాలు వెంటాడుతున్నాయి.

ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల కోసం ఆత్మనిర్భర స్వ నిధి(పీఎం స్వనిధి) సమృద్ధిని ప్రవేశపెట్టింది. తక్కువ వడ్డీలకు రుణాలు ఇవ్వడం రాయతీలు కల్పించడం వ్యాపారుల కుటుంబాల సామాజిక ఆర్థిక స్థితులను తెలుసుకొని సంక్షేమ పథకాలు చోటు కల్పించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం.

**చాలీచాలని బతుకులు**
ఈ వ్యాపారంలో పూట గడవడం కష్టంగా ఉంది సూపర్ మార్కెట్లు పెద్దపెద్ద కూరగాయల మార్కెట్ రావడం వల్ల మా వీధి వ్యాపారం సరిగ్గా నడవట్లేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.
**వక్కలగూడెం నిర్మల.**
**(కూరగాయల వ్యాపారి ప్రగతి నగర్).**

**సుదూర ప్రాంతాల నుంచి వచ్చాం**
దూర ప్రాంతమైన ఉత్తరప్రదేశ్ నుండి పొట్ట చేత పట్టుకొని జవహర్ నగర్ వచ్చాం. పోటీ తీవ్రంగా ఉంది దినసరి సరుకులకే డబ్బులేక అప్పు తెచ్చుకొని చాట్ బండారు నడుపుతున్నాను.
**నరేష్ సింగ్ పరిహార.**
**(అంబేద్కర్ నగర్ చాట్బండార్ వ్యాపారి)**

**ఆన్లైన్ వ్యాపారాల వల్ల గిరాకీలు సరిగా లేవు**
ఆన్ లైన్ వ్యాపారాల వల్ల మా గిరాకీలు సరిగా నడవట్లే, దినసరి కూలీ కూడా గిట్టుబాటు కావట్లేదు. గిరాకి లేక కూరగాయలు ఎండిపోతున్నాయి.
**లలిత, కూరగాయల వ్యాపారి (గబ్బిలాల పేట).**

ఇకనైనా తెలంగాణ ప్రభుత్వం వీధి వ్యాపారుల పట్ల వీధి వ్యాపారుల అభివృద్ధి కోసం వీధి వ్యాపారుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడి వారికి జీవన సౌకర్యాలు కల్పించాలని జవహర్ నగర్ ప్రజలు కోరుకుంటున్నారు.



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిద్దాం

**రాజేంద్రనగర్ మహా ;** బహుజన పోరాట యోధుడు, అణగారిన వర్గాలకు రాజకీయ, సామాజిక, సమానత్వం కోసం పాటుపడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి గ్రామంలో అయిన విగ్రహానికి గ్రామ సర్పంచ్ ఎల్గని ప్రభాకర్ గౌడ్, ఉప సర్పంచ్ దండు శివ కుమార్,మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, వార్డు సభ్యులతో కలిసి మంగళవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.నిరంకుశ పాలనను ఎదిరించి అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరం కొనసాగించాలన్నారు. ఆయన సేవలను, త్యాగాలను నిరంతరం స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని గ్రామ సర్పంచ్ ప్రభాకర్ గౌడ్ తెలిపారు.కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## పోల్కంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా పల్చం అబ్బయ్యగౌడ్

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 18 మహా:** పోల్కంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా పల్చం అబ్బయ్యగౌడ్ నియమితులయ్యారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావణమోని లింగం ముదిరాజ్ సమక్షంలో, గ్రామ శాఖ అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్లో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పల్చం అబ్బయ్య గౌడ్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, గ్రామంలోని కాంగ్రెస్ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పల్చం అబ్బయ్య గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి గ్రామ సర్పంచ్గుండ్ల కొండల గౌడ్,పిఏసిఎస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి,మాజీ సర్పంచ్ చెరుకూరి అండాలగిరి,బాల్రెడ్డి, పంది కిషన్,గంటిల శంకర్,గురుకుల శీను, జక్కుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ ఉద్యమ నేతలను కించపరుస్తున్న కాంగ్రెస్

- పెద్ది విగ్రహం తొలగింపు పై మాజీ ఎమ్మెల్యే నన్నపునేని ఫైర్
- అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు.. కొత్తేమీ కాదు నన్నప్పనేని



**వరంగల్, బ్యూరో మహా ;** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఉద్యమ సహచరుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపు పై వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలోనన్నపునేని నరేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమానికి విశేషంగా కృషి చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే, ఉద్యమ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం బాధాకరమని అన్నారు. స్వరాష్ట్ర సాధనలో తెలంగాణ ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ మరలా ఇప్పుడు మరణించిన వ్యక్తి పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని, కాంగ్రెస్ ప్రభుత్వ తీరు పై మాజీ ఎమ్మెల్యే నరేందర్ నిప్పులు చిమ్మారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ఒక విగ్రహాన్ని తొలగిస్తే.. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం పెడతామని, మాకంటే ముందుగా ప్రజలే స్వచ్ఛందంగా పలు చోట్ల పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారని అప్పుడు స్థానిక ఎమ్మెల్యే అధికారులు ఏం చేస్తారో చూద్దామన్నారు.

**ఉద్యమ నేత విగ్రహం ఎందుకు తొలగించారు?**
బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ.. తెలంగాణ కోసం పోరాడిన పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడంలొ ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా తీసుకున్న నిర్ణయాలను ఉప సంహరించుకోవాలని హితవు పలికారు. కనీసం పెద్ది సుదర్శన్‌రెడ్డి అంత్యక్రియల అనంతరం ఆయన అస్తికలను భద్రాచలంలో కలపకముందే ఆయన కుటుంబం పై వివక్ష చూపడం ఎందుకు? పెద్ది కుటుంబంపై ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ఓటమి తప్పదని తన రాజకీయ భవిష్యత్తుకు ఇది ఒక ముగింపు అని తెలిపారు. ప్రజల ఆగ్రహాన్ని ప్రభుత్వం, అధికార యంత్రాంగం గుర్తించాలని పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపు వ్యవహారంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని పాఖాల కు గోదావరి నీళ్లు తీసుకువచ్చిన మహా నాయకుడు పెద్ద సుదర్శన్ రెడ్డి అని ఆయన చనిపోయాక కూడా ఆయన పై కక్ష సాధింపులో విగ్రహాన్ని కూలగొట్టి ఆ కుటుంబ సభ్యులకు కన్నీళ్లు మిగిల్చిన కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం చేస్తామని ఇలాంటి స్థానిక ఎమ్మెల్యే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 30 సంవత్సరాల నా రాజకీయంలో చనిపోయిన వ్యక్తి పై ఇలాంటి కక్ష సాధింపు చర్యలు ఏ ఒక్క నాయకుడు చేయలేదని పెద్ది విగ్రహ ఏర్పాటు బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని దీనిపై నా మీద కూడా కేసు పెట్టడం సిగ్గుచేటు అని పెద్ద సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని పెడుతున్న సమయంలో పోలీస్ కానిస్టేబుల్ పెట్రోలింగ్ కోసం వచ్చి అక్కడకు చేరుకున్న కానిస్టేబుల్ కు ఎలాంటి పత్రాలు మేము చూపెట్టలేదని ఎస్ఐ తో గొడవ చేసామని చివరికి నర్సంపేట నియోజకవర్గం లో ఏ ఒక్కరు కూడా కేసు పెట్టేందుకు ముందు రాకపోతే పోలీస్ కానిస్టేబుల్ చేతనే పోలీస్ కేసు పెట్టించుకునే స్థితికి ఈ కాంగ్రెస్ నేతలు దిగజారి పోయారని అర్థమైందని నర్సంపేట టౌన్ లో ఏ ఒక్కరు కూడా విగ్రహ ఏర్పాటుకు వ్యతిరేకంగా లేరని

కేవలం స్థానిక ఎమ్మెల్యే తన సొంత ఏజెండాతో అధికార బలంతో పోలీసులను, అధికారులను అడ్డుపెట్టుకొని విగ్రహాన్ని మాత్రమే తొలగించాడు కానీ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న పెద్ది సుదర్శన్ రెడ్డిని చేసిన మంచి పనులను వారి ఆశయాలను తొలగించలేకపోయారని రానున్న రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ నేతలకు గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం బీ ఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# భువనగిరి ఖిల్లా పై సర్దార్ సర్వాయి పాపన్న 376వ ఘనంగా జయంతి

**భువనగిరి ఆగస్టు 18 మహా:** సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని ఖిల్లా వద్ద విగ్రహానికి మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ సలహాదారులు మాజీ పీసీసి అధ్యక్షులు వి. హనుమంతరావు, భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్,భువనగిరి ఎమ్మార్వో జగన్ , సర్దార్ సర్వాయి పాపన్న ఉత్సవ అధ్యక్షులు పంజాల జైహింద్ గౌడ్, బాలరాజ్ రాష్ట్ర గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ పీసీసీ అధ్యక్షులు బీసీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హనుమంతరావు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న బీసీలకు మాత్రమే కాదు, తెలంగాణ ప్రజలందరికీ ఆత్మగౌరవానికి ప్రతీక. స్వాతంత్ర్యానికి ముందే రాజ్యం ఏలిన గొప్ప యోధుడు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరం కొనసాగించాలి అని అన్నారు. మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న కేవలం ఒక యోధుడు మాత్రమే కాదు. ఆయన బీసీ, గిరిజన, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి చిహ్నం. మొఘులులను ఎదిరించి స్వయం పాలన సాధించిన మొట్టమొదటి తెలుగు వీరుడు. ఆయన త్యాగం, ధైర్యం నేటి యువతకు స్ఫూర్తి. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. పాపన్న కలలు కన్న సమాజ స్థాపనకు మనమందరం కృషి చేయాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్ కుక్క దుగు సోమయ్య, ,మజార్ పాషా (బబ్లు) కౌన్సిలర్ అనిల్ నాగారం శంకర్, కూర శివ కుమార్, పిట్టలా బాలరాజ్, ఆవు శెట్టి పాండు, నజీర్ భాయ్, షేక్ వాజీద్ ,హెరే కార్ శ్రీను, రఫీద్దీన్, గౌడ సంఘం సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## హామీల అమలుకు పంచాయతీ కార్మికుల సమ్మె

**కారేపల్లి, మహా:** గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి మండలంలోని 41 గ్రామపంచాయతీల కార్మికులు మంగళవారం సమ్మె చేపట్టారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట రిలే దీక్షలు నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, జీవో నంబర్ 51ను సవరించి బహుళ ప్రయోజన విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా, మండల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయకం

- జయంతి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి ఆగస్టు 18 మహా :**బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పోరాడిన సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. సర్వాయి పాపన్న జయంతిని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. పేదల కోసం ఆయన చేసిన త్యాగం, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా నడిపిన ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బి.సి.సంక్షేమ అధికారి బి.సుబ్బా రెడ్డి, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ శ్యాంసుందర్, కలెక్టరేట్ అంజిరెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది మరియు కల్లుగీత కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు రాంపల్లి సోములు, జిల్లా కార్యదర్శి బొమ్మకంటి బాలరాజు, బొల్లేపల్లి మాజీ సర్పంచ్ గోదా శ్రీనివాస్ గౌడ్, బి.సి సంఘం, అధక్షుడు కె.బాలరాజు, సామాజిక కార్యకర్త కె.వెంకటేష్, జి.సోములు, కె..అశోక్, ఆర్.కొండల్, ఆర్,చంద్రయ్య, పి.మైసయ్య, యన్.ఆంజనేయులు, బి,సత్తయ్య, కె.మధు, కె.వెంకటేష్, బి.శంకర్, కె.భూపాల్, బి. చంద్రయ్య పాల్గొన్నారు.



# వచ్చే గణేష్ ఉత్సవాలకు ఆటంకం కలగొద్దు

- విగ్రహ నిమజ్జనంలో ప్రతిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టాలి
- తుర్కయంజాల్ చెరువును పరిశీలించిన ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 18 మహా:**రాబోయే గణేష్ ఉత్సవాన్ని మరియు గణేష్ విగ్రహ నిమజ్జనం సందర్భంగా భక్తులు, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, డీసీపీ ట్రాఫిక్III రాహుల్ హెగ్డే, ఐపీఎస్, తుర్కాయంజల్ సరస్సును సందర్శించి, ప్రతిపాదిత నిమజ్జన ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ పర్యటన సందర్భంగా, ఆయన ట్రాఫిక్ ప్రవాహం, పార్కింగ్ ఏర్పాట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, జనసమూహ నిర్వహణ, బారికేడింగ్ ఇతర ట్రాఫిక్ సంబంధిత ఏర్పాట్లను సమీక్షించారు. ట్రాఫిక్‌ను సజావుగా నియంత్రించడం, రద్దీని నివారించడం, భక్తులు, వాహనాల రాకపోకలను సులభతరం చేయడం, అన్ని సంబంధిత విభాగాలతో సరైన సమన్వయం పాటించడం కోసం ఆయన సంబంధిత అధికారులకు, సిబ్బందికి అవసరమైన సూచనలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, ఆదిభట్ల సీఐ రమేష్, ఎస్సైలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మహా పత్రిక



ANN తెలుగు

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | బుధవారం, హైదరాబాద్ | 19-08-2026

# సంప్రదాయ సోయగం

**మహా :** తిరునెల్వేలిలో జరిగిన సఫా గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీనటి శ్రీయ శరణ్ హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ కంచీవరం చీరలో మెరిసిన ఆమె అందం, ఆభరణాల అలంకరణ కార్యక్రమానికి మరింత శోభను తీసుకొచ్చింది. ఎరుపు, బంగారు రంగుల కలయికతో రూపొందించిన కంచీవరం చీరను శ్రీయ శరణ్ ధరించారు. చీరపై ఉన్న సున్నితమైన జరీ, అల్లికల డిజైన్లు ఆమె సంప్రదాయ లుక్‌ను మరింత అందంగా తీర్చిదిద్దాయి. దీనికి సరిపోయేలా బంగారు అంచులతో కూడిన ఎరుపు రంగు బ్లౌజ్‌ను ధరించారు.

మెడలో దేవాలయ శిల్పాల డిజైన్లతో రూపొందించిన పొడవైన బంగారు హారాలు, చెవులకు సంప్రదాయ జుంకాలు, చేతులకు వరుసగా బంగారు గాజులు, వేలికి స్టేట్‌మెంట్ రింగ్‌తో శ్రీయ శరణ్ ప్రత్యేకంగా కనిపించారు. నుదుటన ఎరుపు బొట్టు, వేవీ హెయిర్‌స్టైల్‌తో ఆమె సంప్రదాయ భారతీయ సౌందర్యాన్ని ప్రతిబింబించారు. సింపుల్ బ్యాక్‌డ్రాప్ ముందు ఆమె ఇచ్చిన ఫొటోలకు అభిమానుల నుంచి మంచి స్పందన లభించింది.

తెలుగు చిత్ర పరిశ్రమలో 'ఇష్టం' సినిమాతో 2001లో కథానాయికగా శ్రీయ శరణ్ పరిచయమయ్యారు. ఆ తర్వాత 'సంతోషం' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం హిందీ చిత్ర పరిశ్రమలో 'తుఝే మేరీ కసం'తో అడుగుపెట్టారు. రజనీకాంత్ సరసన నటించిన 'శివాజీ' చిత్రంతో దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు సంపాదించారు. 'అవారాపన్', 'మనం', 'దృశ్యం' సిరీస్, 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి చిత్రాలు ఆమె కెరీర్‌లో కీలకంగా నిలిచాయి. ప్రస్తుతం కూడా శ్రీయ శరణ్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'దృశ్యం 3', తమిళ చిత్రం 'సండక్కారి', 'మిరాయ్'తో పాటు 'స్పేస్ జెన్: చంద్రయాన్' వెబ్ సిరీస్‌లోనూ ఆమె నటిస్తున్నారు. విభిన్న భాషల్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులకు మరింత చేరువవుతున్న శ్రీయ శరణ్, తాజాగా సంప్రదాయ చీరకట్టులో కనిపించి మరోసారి తన అందంతో అభిమానులను ఆకట్టుకున్నారు.



# ప్రమోషన్స్‌పై నయన్ కొత్త వైఖరి



**మహా :** సినిమా ప్రమోషన్లకు దూరంగా ఉండే నయనతార విషయంలో ఇప్పుడు ఆసక్తికరమైన మార్పు కనిపిస్తోంది. సాధారణంగా తాను నటించే సినిమాలకు సంబంధించిన ప్రచార కార్యక్రమాలకు హాజరుకాకూడదనే నిబంధనతోనే ఆమె సినిమాలు అంగీకరిస్తారని సినీ వర్గాల్లో చాలాకాలంగా ప్రచారం ఉంది. పారితోషికం పెంచినా ఈ విషయంలో తన నిర్ణయాన్ని మార్చుకోరని చెబుతుంటారు. అయితే ఇటీవల కొన్ని సినిమాల విషయంలో నయనతార ప్రమోషన్లలో కనిపించడం చర్చనీయాంశంగా మారింది.గతంలో చిరంజీవితో కలిసి నటించిన 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్‌ఫాదర్' వంటి చిత్రాల ప్రచార కార్యక్రమాలకు నయనతార దూరంగా ఉన్నారు. 'గాడ్‌ఫాదర్'లో కీలక పాత్ర పోషించినప్పటికీ సినిమా ప్రమోషన్లలో ఆమె పెద్దగా కనిపించలేదు. దీంతో నయనతార ప్రమోషన్లకు ఎందుకు దూరంగా ఉంటారనే చర్చ అప్పట్లో ఎక్కువగా జరిగింది.అయితే నిర్మాతగా మారిన తర్వాత ఆమె వైఖరిలో మరో కోణం బయటపడింది. తాను నిర్మించిన 'కనెక్ట్' సినిమాకు నయనతార స్వయంగా ప్రచారం నిర్వహించారు. తెలుగు, తమిళ భాషల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొంటూ సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో సొంత నిర్మాణ సంస్థ సినిమాలకు ఒకలా, ఇతర నిర్మాతల చిత్రాలకు మరోలా వ్యవహరిస్తున్నారంటూ అప్పట్లో విమర్శలు కూడా ఎదురయ్యాయి.సినిమాలతో పాటు వ్యాపార రంగంలోనూ నయనతార అడుగుపెట్టారు. స్కిన్‌కేర్ ఉత్పత్తుల బ్రాండ్‌ను ప్రారంభించి వ్యాపార కార్యకలాపాలపై దృష్టి పెట్టారు. బ్రాండ్ ప్రచారంలో భాగంగా ప్రకటనల్లో నటించడంతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విదేశాల్లో నిర్వహించిన ప్రెస్ మీట్లలోనూ తన భర్తతో కలిసి పాల్గొన్నారు. దీంతో వ్యాపార ప్రచారానికి సమయం కేటాయిస్తున్న నయనతార సినిమాల ప్రమోషన్లకు మాత్రం ఎందుకు దూరంగా ఉంటారంటూ సోషల్ మీడియాలో చర్చ సాగింది.ఇటీవల 'మన శంకర వరప్రసాద్' విషయంలోనూ ఆమె ప్రమోషనల్ ఈవెంట్లకు ప్రత్యక్షంగా హాజరు కాలేదు. అయితే సినిమా షూటింగ్ ప్రారంభం, ముగింపు సందర్భాల్లో వీడియోల ద్వారా అభిమానులను పలకరించారు. నయనతారను ప్రమోషన్లకు ఒప్పించేందుకు దర్శకుడు అనిల్ రావిపూడి ప్రత్యేకంగా ప్రయత్నించారని చిరంజీవి కూడా పలు సందర్భాల్లో ప్రస్తావించారు.ఇక 'టాక్సిక్' ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి నయనతార హాజరు కావడం మాత్రం అందరినీ ఆశ్చర్యపరిచింది. హీరో యష్ స్వయంగా ఫోన్ చేయడంతో కార్యక్రమానికి రావడానికి అంగీకరించానని ఆమె వెల్లడించారు. ప్రమోషన్లకు దూరంగా ఉండటానికి ప్రత్యేకమైన కారణం ఏమీ లేదని, ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనడం తనకు సాధ్యం కాకపోవడంతోనే సాధారణంగా ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉంటానని ఆమె వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఇంటర్వ్యూలకు కూడా ఎక్కువగా దూరంగా ఉండే నయనతార 'టాక్సిక్'కు సంబంధించిన ప్రచారంలో మాత్రం పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. దీంతో రాబోయే సినిమాల విషయంలోనూ ఆమె ఇదే విధానాన్ని కొనసాగిస్తారా? లేక ప్రమోషనల్ కార్యక్రమాల్లో మరింత చురుగ్గా కనిపిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఏదేమైనా, ఇటీవల నయనతార ప్రమోషన్ల విషయంలో చూపిస్తున్న మార్పు సినీ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

# 'వారణాసి' మేకింగ్‌పై ప్రత్యేక డాక్యుమెంటరీ

**మహా :** సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. భారీ బడ్జెట్, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లోనే కాకుండా సినీ వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సినిమా నిర్మాణం వెనుక జరుగుతున్న ఆసక్తికర ప్రక్రియను ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు ప్రత్యేకంగా మేకింగ్ డాక్యుమెంటరీని రూపొందిస్తున్నట్లు సమాచారం.

'వారణాసి' కోసం భారీ యాక్షన్ సన్నివేశాలు, విస్తృతమైన సెట్స్, అత్యాధునిక విజువల్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జంతువులతో చిత్రీకరించే క్లిష్టమైన సన్నివేశాల కోసం చిత్రబృందం చేపడుతున్న ప్రత్యేక ఏర్పాట్లు, రిహార్సల్స్, సాంకేతిక ప్రక్రియను కూడా డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. షూటింగ్ సమయంలో ఎదురైన సవాళ్లు, భారీ సన్నివేశాల రూపకల్పన, వాటి వెనుక నటీనటులు, దర్శకుడు, సాంకేతిక నిపుణులు చేసిన కృషిని ఇందులో పొందుపరిచే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఈ మేకింగ్ డాక్యుమెంటరీకి ప్రముఖ డాక్యుమెంటరీ దర్శకుడు గోగితా చిక్వైడ్జే పనిచేస్తున్నట్లు IMDbలో నమోదైన వివరాల ఆధారంగా వార్తలు వెలువడ్డాయి. అయితే దీనిపై 'వారణాసి' చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సినిమా నిర్మాణంలో అనుసరిస్తున్న అంతర్జాతీయ స్థాయి విధానాలు, భారీ యాక్షన్ సన్నివేశాల వెనుక ఉన్న శ్రమ, సాంకేతిక నైపుణ్యాలను ప్రేక్షకులకు చూపించడమే డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు.

సినిమా విడుదల సమయంలో ప్రమోషనల్ కంటెంట్‌గా లేదా విడుదల అనంతరం ప్రత్యేక ఫీచర్‌గా ఈ డాక్యుమెంటరీని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా షూటింగ్ సెట్స్‌లో చోటుచేసుకున్న ఆసక్తికర ఘటనలు, కీలక సన్నివేశాల రూపకల్పన, నటీనటుల అనుభవాలు, సాంకేతిక బృందం ఎదుర్కొన్న సవాళ్లను ఇందులో చూపిస్తే సినిమాపై మరింత ఆసక్తి పెరిగే అవకాశం ఉంది.

మహేశ్‌బాబు, రాజమౌళి కలయికలో వస్తున్న తొలి చిత్రం కావడంతో 'వారణాసి' ఇప్పటికే భారీ క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు సినిమా మేకింగ్ ప్రక్రియపైనే ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారనే ప్రచారం ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తిని పెంచుతోంది. అయితే డాక్యుమెంటరీ ఎప్పుడు విడుదల కానుంది, దాని నిడివి ఎంత, ఏ వేదికపై అందుబాటులోకి వస్తుంది వంటి పూర్తి వివరాలు చిత్రబృందంఅధికారికంగా వెల్లడించాల్సి ఉంది.





# OG 2'పై పెరుగుతున్న అంచనాలు

**మహా :** పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'OG 2' సినిమాపై తాజాగా పలు ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. 'OG' చిత్రానికి కొనసాగింపుగా రూపొందనున్న ఈ సీక్వెల్ కథ, స్క్రీన్‌ప్లేకు సంబంధించిన ప్రాథమిక పనులు పూర్తయినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మేకర్స్ కథను మరింత విస్తృతంగా తీర్చిదిద్దడంతో పాటు స్క్రిప్ట్‌ను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం సినిమా ప్రీప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.పవన్ కల్యాణ్ ప్రస్తుతం రాజకీయ బాధ్యతల్లో బిజీగా ఉండటంతో 'OG 2' షూటింగ్ వెంటనే ప్రారంభమయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు సమాచారం. పరిస్థితులు అనుకూలిస్తే 2027 వేసవిలో చిత్రీకరణ మొదలయ్యే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈలోపు దర్శకుడు సుజీత్ తన తదుపరి ప్రాజెక్ట్ 'బ్లడీ రోమియో' పనులను పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు టాక్.

ఇక 'OG 2' కథను మొదటి భాగం కంటే మరింత విస్తృతమైన నేపథ్యంతో తెరకెక్కించేందుకు సుజీత్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. 'OG'లో పవన్ కల్యాణ్ పోషించిన ఓజస్ గంభీర పాత్రకు సంబంధించిన గతాన్ని ఈ సీక్వెల్‌లో మరింత లోతుగా చూపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా ముంబై అండర్‌వరల్డ్‌లోకి అడుగుపెట్టడానికి ముందు ఓజస్‌కు జపాన్‌తో ఉన్న అనుబంధం, అక్కడి నేపథ్యం, సమురాయ్ సంస్కృతితో ముడిపడిన అతడి జీవితంలోని కీలక ఘట్టాలను కథలో ప్రధానంగా ఆవిష్కరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ సినిమాలో పవన్ కల్యాణ్‌తో పాటు జపాన్‌కు చెందిన ప్రముఖ నటుడు కజుకి కితామురా కీలక పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన పాత్ర కథలో ఎంత ముఖ్యమైనది అనే వివరాలు మాత్రం ఇంకా వెల్లడించలేదు. కథకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి యాక్షన్ సన్నివేశాలు, భారీ సెట్స్, విభిన్న లొకేషన్లను ఉపయోగించేందుకు చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.'OG 2'కు థమన్ సంగీతం అందించనున్నట్లు సమాచారం. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ తొలి భాగం కంటే మరింత భారీ స్థాయిలో సీక్వెల్‌ను రూపొందించాలనే ఆలోచనలో దర్శకుడు ఉన్నట్లు తెలుస్తోంది.

మరోవైపు పవన్ కల్యాణ్ పుట్టినరోజైన సెప్టెంబర్ 2న 'OG 2' నుంచి అభిమానులకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు మేకర్స్ ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా యానిమేషన్ ప్రోమోను విడుదల చేసే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది.

పవన్ కల్యాణ్–సుజీత్ కాంబినేషన్‌కు ఇప్పటికే భారీ క్రేజ్ ఉండటంతో 'OG 2'పై అభిమానుల్లో అంచనాలు మరింత పెరుగుతున్నాయి. కథలో కొత్త నేపథ్యం, అంతర్జాతీయ అంశాలు, భారీ యాక్షన్ ఎలిమెంట్స్ జోడిస్తున్నారనే వార్తలు ఈ ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. అధికారిక ప్రకటనలు ప్రారంభమైన తర్వాత సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వరుసగా బయటకు వచ్చే అవకాశం ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com